నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 12-9-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:35 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

అప్పుల పద్దు
మన ప్రగతి పద్దు
అంకెల రంకె
నీటి జాడలు
చేపలు ఎదురీత
శశి పిలుపు
నవరత్నాలు
అభివృద్ధి కాంతులు
నేత కలలు
మాఫీ కబురు
రైతు భరోసా వార్త
మిఠాయి పొట్లం
జారిన మాట
నేలకు ముక్కు రాసి
ముక్కు సర్జరీ

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజము

పల్లె పట్నమనకుండా
చలికి గజగజ వణికె !
చిరపుంజిగ తయారయ్యి
మారిపోయే ఉనికె !
వాయుగుండమాగిపాయె
వానజల్లు వెలిసె !
వర్షహోరు తప్పినట్టె
ఎండ రాగ తెలిసె !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

పోలీస్ క్రీడా భవనాన్ని ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 11 : తెలంగాణ పోలీస్ అకాడమీలో నూతనంగా నిర్మించిన క్రీడా భవనాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన కొంత సేపు పోలీస్ ఉన్నతాధికారులతో షటిల్ ఆడారు.. అనంతరం ఆయన మాట్లాడుతూ, పోలీస్ యంత్రంగానికి కావాలసిన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు.. ఈ క్రీడా ప్రాంగణంలో షటిల్, టిటి, తో జిమ్ కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డిజిపి జితేందర్ తో పాటు పలువురు ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు..

తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న కర్ణాటక గవర్నర్

తిరుపతి, సెప్టెంబర్ 11 : కర్ణాటక గవర్నర్‌థావర్ చంద్ గెహ్లోట్‌బుధవారం తిరుమలలోని శ్రీవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు టీటీడీ అడిషనల్‌ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, అర్చకులు, అధికారులు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో శ్రీవారి ప్రసాదం, టీటీడీ క్యాలెండర్, ఫొటోను అందజేశారు.

తిరుమలకు భక్తుల రద్దీ సాధారణంగానే ఉంది. శ్రీవారి ఉచిత సర్వదర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. ఉచిత సర్వదర్శనం కోసం 4 కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉన్నారు. ఇక టైమ్ స్లాట్ (ఎస్ఎస్‌డీ) దర్శనానికి 3 కంపార్టుమెంట్లలో భక్తులు వేచి ఉండగా.. శ్రీవారి దర్శనానికి 3 గంటల సమయం పడుతుంది. రూ. ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 2 గంటల సమయం పడుతుంది. మంగళవారం నాడు తిరుమల శ్రీవారిని 62,380 మంది భక్తులు దర్శించుకున్నారు. 21,405 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారి హుండీ ఆదాయం 3.95 కోట్లుగా ఉంది.

అకాంక్షలను నెరవేరుస్తాం.. నూతన ఎస్సైలతో సీఎం రేవంత్

–ట్రయినీ ఎస్సైలకు మెడల్స్ అందజేత
–తెలంగాణ పోలీస్ అకాడమీలో కార్యక్రమం
–సబ్ ఇన్‌స్పెక్టర్ల పాసింగ్ అవుట్ పరేడ్
–547 మందితో పాసింగ్ అవుట్ పరేడ్
–వీరిలో 145 మంది మహిళా ఎస్సైలు
–సబ్ ఇన్‌స్పెక్టర్ల మూడో బ్యాచ్ శిక్షణ పూర్తి
–పోలీస్ స్కూల్ ఏర్పాటుకు 50 ఎకరాలు
–రాబోయే రెండేళ్లలో స్కూల్ నిర్మిస్తాం
–స్పష్టం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
–సీఎం రిలీఫ్ ఫండ్‌కు 11 కోట్ల విరాళం
–చెక్కు అందజేసిన డీజీపీ జితేందర్

హైదరాబాద్, సెప్టెంబర్ 11 : తెలంగాణ పోలీస్ అకాడమీలో బుధవారం సబ్ ఇన్?స్పెక్టర్ల మూడో బ్యాచ్ పాసింగ్ అవుట్ పరేడ్? జరిగింది. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్?రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ శిక్షణలో మెరుగైన ప్రదర్శన చేసిన వారికి సీఎం మెడల్స్ అందించారు. పోలీస్ స్కూల్ ఏర్పాటుకు 50 ఎకరాలు కేటాయిస్తామని, రాబోయే రెండేళ్లలో పోలీస్ స్కూల్ ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. పోలీసు సిబ్బంది పిల్లలు ఒకేచోట చదువుకోవాలని సూచించారు. అంతకుముందు పోలీస్ విభాగం తరఫున 11 కోట్ల 6 లక్షల 83 వేల 571 రూపాయలను ముఖ్యమంత్రి సహాయనిధికి ఉన్నతాధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్, శివధర్ రెడ్డి తదితరులు రేవంత్?రెడ్డికి చెక్?ను అందజేశారు.

అకాంక్షలను నెరవేరుస్తాం..

గత ప్రభుత్వ హయాంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరలేదని, తెలంగాణలో డిసెంబర్ 3న ప్రజాపాలన ఆవిర్భవించిందని ముఖ్యమంత్రి రేవంత్?రెడ్డి అన్నారు. కాంగ్రెస్ వచ్చాక 30 వేలకుపైగా ఉద్యోగాలు కల్పించామని, మరో 35 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చామని వెల్లడించారు. కొత్తగా గ్రూప్–1, 2, 3, డీఎస్సీ, పారామెడికల్ సిబ్బంది భర్తీకి నోటిఫికేషన్లు ఇచ్చామని తెలిపారు. టీఎస్‌పీఎస్సీపై నిరుద్యోగులకు ఎలాంటి అనుమానాలు లేవని వ్యాఖ్యానించారు. గతంలో ఉద్యోగ నోటిఫికేషన్ల కోసం ఎదురుచూసే పరిస్థితి ఉండని, ప్రస్తుత ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు వరుసగా ఇస్తోందని చెప్పారు.

గంజాయి, సైబర్ నేరాలపై ఉక్కుపాదం..

అన్ని నోటిఫికేషన్లు ఒకేసారి ఇస్తే ఇబ్బందవుతుందని చాలామంది వాయిదా వేయాలని కోరారు. గ్రూప్–2 పరీక్షలు వాయిదా వేసి నిరుద్యోగులకు అనుకూల నిర్ణయం తీసుకున్నాం. సైబర్, గంజాయి నేరాలను ఉక్కుపాదంతో అణచివేయాలి. త్యాగాలతో సాధించుకున్న తెలంగాణలో వ్యసనాలకు తావు లేదు. కులవృత్తులతో పాటు చేతి వృత్తులను బలోపేతం చేస్తున్నాం. వ్యవసాయం దండగ కాదు, పండుగ అని నిరూపించాం. రైతులు ఆత్మగౌరవంతో తల ఎత్తుకునేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉన్నాయి. 22 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 18 వేల కోట్లు జమ చేశాం అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

547 సబ్ ఇన్‌స్పెక్టర్ల పాసింగ్ అవుట్ పరేడ్

పాసింగ్ అవుట్ పరేడ్‌కు ట్రైనింగ్ పూర్తి చేసుకున్న మొత్తం 547 సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు. వీరిలో 145 మంది మహిళా ఎస్సైలు, 402 మంది పురుషులు ఉన్నారు. 547 శిక్షణ ఉద్యోగుల్లో 401 మంది సివిల్? ఎస్సైలు ఉన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న 547 మందిలో 472 మంది గ్రాడ్యుయేట్స్?, 75 మంది పోస్ట్ గ్రాడ్యుయేట్స్ ఉన్నారు. వీరిలో 248 మంది బీటెక్? బ్యాక్ గ్రౌండ్ నుంచి వచ్చారు. పాసింగ్ అవుట్ పరేడ్ కమాండర్‌గా మహిళా ఎస్ఐ భాగ్యశ్రీ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధికి పోలీసులు రూ.11 కోట్లు విరాళం..

తెలంగాణలో భారీ వర్షాల కారణంగా పోటెత్తిన వరదలతో అతలాకుతలమైన ముంపు ప్రాంతాల బాధితులను ఆదుకునేందుకు పలువురు ప్రముఖులు ముందుకు వస్తున్నారు. ఈ క్రమంలో తెలంగాణ పోలీసులు కూడా తమ ఒకరోజు జీతాన్ని ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళంగా ఇచ్చారు.

దీని తాలూకు రూ. 11,06,83,571 చెక్కును పోలీసు ఉన్నతాధికారులు సీఎం రేవంత్ రెడ్డి చేతికి అందజేశారు.

తెలంగాణ పోలీస్ అకాడమీలో బుధవారం జరిగిన ఎస్సై పాసింగ్ పరేడ్ కార్యక్రమంలో ముఖ్యమంత్రికి డీజీపీ జితేందర్ తెలంగాణ పోలీసుల తరఫున చెక్‌ను అందించారు.

భూమి కోల్పోయిన వారిని మనం గౌరవించాలి : డిప్యూటీ సీఎం భట్టి

నల్లగొండ , సెప్టెంబర్ 11 : యాదాద్రి పవర్ ప్లాంట్ ప్రాజెక్టు కోసం భూమి కోల్పోయిన వారిని మనం గౌరవించాలి. మహోన్నత ఆశయం కోసం వారు భూమిని త్యాగం చేశారు. ప్రాజెక్టు ప్రారంభమయ్యేలా అర్హులైన వారికి శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. దామరచర్లలోని యాదాద్రి పవర్ ప్లాంట్ ఆయల్ సింకరైజేషన్ పరిశీలించిన అనంతరం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..భూ నిర్వాసితులకు పరిహారం సత్వరమే చెల్లించాలని అధికారులను ఆదేశించారు.

2025 మార్చి కల్లా యాదాద్రిలో 4000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయడమే టార్గెట్‌గా పెట్టుకోవాలన్నారు. కూలీలను పెద్ద ఎత్తున తీసుకోవాలని సూచించారు. పవర్ ప్లాంట్ నుంచి దామరచర్ల వరకు బొగ్గు రవాణా ఇతర అవసరాలకు నాలుగు లైన్ల ప్రత్యేక రహదారి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

తెలంగాణాలో వరద బాధితుల సహాయార్థం పవన్ కళ్యాణ్ రూ. కోటి విరాళం

హైదరాబాద్ సెప్టెంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బుధవారం ఉదయం సమావేశమయ్యారు. జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసానికి పవన్ కల్యాణ్ వెళ్లారు. రాష్ట్రంలోని వరద బాధితుల సహాయార్థం రూ. కోటి విరాళాన్ని ఇటీవల ఏపీ డిప్యూటీ సీఎం ప్రకటించారు. ఆ సహాయార్థానికి సంబంధించిన చెక్కును నేడు సీఎం రేవంత్ రెడ్డికి పవన్ కల్యాణ్ అందజేశారు. అనంతరం ఇరు రాష్ట్రాల మధ్య సత్సంబంధాలు, ఇతర అంశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయనతో పవన్ భేటీ కావడం ఇదే తొలిసారి.

పాకిస్థాన్‌లో తీవ్ర భూకంపం ..రిక్టర్ స్కేలే పై 5.8 తీవ్రత నమోదు

– వణికిన ఉత్తర భారతం

న్యూ ఢిల్లీ సెప్టెంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూస్);పాకిస్థాన్ లో బుధవారం మధ్యాహ్నం 12:58 గంటల సమయంలో 5.8 తీవ్రతతో భూమి కంపించింది. పెషావర్, ఇస్లామాబాద్, లాహోర్‌లో కూడా ప్రకంపనలు నమోదయ్యాయి. భూకంపం కేంద్రం పాకిస్థాన్‌లోని కరోర్‌కు నైరుతి దిశలో 25 కిలోమీటర్ల దూరంలో భూమికి 10 కిలోమీటర్ల లోతులో గుర్తించినట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ వెల్లడించింది.ఈ భూకంపం ధాటికి ఉత్తర భారతదేశంలోనూ ప్రకంపనలు చోటు చేసుకున్నట్లు నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలజీ తెలిపింది. రాజధాని ఢిల్లీ–ఎన్సీఆర్ ప్రాంతం (అవశ్రీప్రతి ? ఔఅఖీ), ఉత్తరప్రదేశ్, హర్యానా, రాజస్థాన్, పంజాబ్, జమ్మూ కశ్మీర్‌లోనూ భూమి కంపించినట్లు పేర్కొంది. అయితే తేలికపాటి ప్రకంపనలే కావడంతో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించలేదు. అటు ఆఫ్ఘనిస్థాన్‌లోనూ భూమి కంపించినట్లు నేషనల్ మీడియా వెల్లడించింది. భూ ప్రకంపనలతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఇళ్లు, కార్యాలయాల నుంచి బయటకు పరుగులు తీశారు.

ఎలక్ట్రానిక్ సెక్టార్‌లో దూసుకుపోతోన్న భారత్

– సెమికండక్టర్ మ్యాన్యుఫ్యాక్చరింగ్‌ను ప్రోత్సహించేందుకు చర్యలు
–ఈ దశాబ్దం చివరి నాటికి 500 బిలియన్ డాలర్లు చేరుకోవడమే ప్రభుత్వ లక్ష్యం
–ఈ రంగం నుంచి ఏకంగా దాదాపు 60 లక్షల ఉద్యోగాలు
–ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడి

గ్రేటర్ నోయిడా సెప్టెంబర్ 11 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఎలక్ట్రానిక్ సెక్టార్‌లో భారత్ దూసుకుపో తోందన్నారు ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. దేశీయంగా పెద్దసంఖ్యలో చిప్స్ తయారీపై భారత్ ప్రస్తుతం దృష్టిసారించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. సెమికండక్టర్ మ్యాన్యుఫ్యాక్చరింగ్‌ను ప్రోత్సహించేం దుకు కేంద్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతున్నదని చెప్పారు. గ్రేటర్ నోయిడాలో బుధవారం ఇండియా ఎక్స్పో మార్ట్‌లో సెమికాన్ ఇండియా 2024 ప్రారంభ కార్యక్రమంలో మోదీ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెమి కండక్టర్ల ఉత్పత్తి కోసం పలు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. భారత్‌లో మరిన్ని చిప్‌లు తయారు కావాలన్నారు.ఎలక్ట్రానిక్ సెక్టార్‌లో ప్రస్తుతం భారత్ 150 బిలియన్ డాలర్ల మైలురాయిని చేరుకుందని.. ఈ దశాబ్దం చివరి నాటికి 500 బిలియన్ డాలర్లు చేరుకోవడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దీని కారణంగా దేశంలో దాదాపు 60 లక్షల మంది యువతకు ఉద్యోగాలు లభిస్తాయని ప్రధాని చెప్పారు. సెమికండక్టర్ మ్యాన్యుఫ్యాక్చ రింగ్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహిం చేందుకు ప్రభుత్వం ప్రోత్సాహకాలతో బాసటగా నిలుస్తున్న దని చెప్పారు. భారత్ అనుసరిస్తున్న విధానాలతో భారత్‌లో లక్షన్నర కోట్లకు పైగా విలువైన పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. ప్రస్తుతం దేశంలో ఎలక్ట్రా నిక్ రంగ మార్కెట్ 150 బిలియన్ డాలర్లకు పైగా ఉందని, దీన్ని మరింత పెంచాలనేది తమ లక్ష్యమని ప్రధాని వివరించారు.ఈ దశాబ్దం చివరికి మన ఎలక్ట్రానిక్ రంగం 500 బిలియన్ డాలర్ల స్థాయికి ఎదగాలనే లక్ష్యం నిర్దేశించుకున్నామని తెలిపారు. దీంతో భారత యువత కోసం ఈ రంగం నుంచి ఏకంగా దాదాపు 60 లక్షల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. నైపుణ్యాలు సంతరిం చుకుంటే పెద్దసంఖ్యలో ఉపాధి అవ కాశాలు మన యువతకు పుష్కలంగా లభిస్తాయని మోదీ వివరించారు.

గోదావరి వరదలపై అప్రమత్తంగా ఉండండి- మంత్రి తుమ్మల

భద్రాచలం, సెప్టెంబర్ 11 : భద్రాచలం వద్ద గోదావరి నదికి రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం ఇక్కడి వరద ఉద్ధృతిని పరిశీలించారు. విస్తా కాంప్లెక్స్ వద్ద మురుగునీరు బయటకు తోడే ప్రక్రియ, గోదావరి కరకట్ట వద్ద వరద ఉద్ధృతి, కొత్త కరకట్ట నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో నీటి పారుదల, పంచాయతీ, ఆర్‌అండ్‌బీ, అగ్రికల్చర్, విద్యుత్, వైద్య శాఖల అధికారులతో సమీక్షించారు. వరదల కారణంగా ఎదురయ్యే సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కూలిపోయిన విద్యుత్ స్తంభాలు, దెబ్బతిన్న రహదారులకు వెంటనే మరమ్మతులు చేయాలని ఆదేశించారు. గోదావరిలో నీటి ప్రవాహం 50 అడుగులు దాటి ప్రవహిస్తున్నందున ఎప్పటికప్పుడు వరద ఉద్ధృతిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గోదావరి నీటిమట్టం ఎంత పెరిగిన భద్రాచలం పట్టణంలో చుక్క నీరు రాకుండా చర్యలు చేపట్టామని అన్నారు. భద్రాద్రి పుణ్యక్షేత్రాన్ని దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం పట్టణాన్ని సర్వాంగ సుందరంగా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు చేపట్టాలని అన్ని ప్రభుత్వ శాఖలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ భద్రాద్రి నాది.. నా సొంతం అని ప్రతి ఒక్క పౌరుడు, ప్రతి అధికారి బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. ఇక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చర్యలు చేపట్టాలని పోలీస్ శాఖకి ఆదేశించారు.. జిల్లా మొత్తం తుఫాను వరదల ప్రభావంగా జరిగిన నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసి.. బాధితులకు వెంటనే డబ్బులు అందే విధంగా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌కి మంత్రి సూచనలు చేశారు. రాముడు కరుణిస్తే ప్రతి ఒక్కరికి అవకాశం వస్తుందని.. రాజకీయవరంగా అధికారం పరంగా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని రాముల వారికి సేవ చేసుకోవాలని తుమ్మల నాగేశ్వర రావు విజ్ఞప్తి చేశారు.

ఇక, ఈ తుఫాను వరదల కారణంగా ఎటువంటి ప్రమాదం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టిన జిల్లా యంత్రాంగాలకి తుమ్మల అభినందనలు తెలిపారు. గతంలో మన జిల్లాలో ఉమ్మడి జిల్లాలో కలెక్టర్లుగా పని చేసిన అనేక మంది ఐఏఎస్ అధికారులు ఇప్పుడు కేంద్రస్థాయిలో ఉన్నత స్థాయిలో పని చేస్తున్నారు అని గుర్తు చేశారు. ఉన్నత స్థానంలో ఉన్న ఐఏఎస్ అధికారులు అందరూ భద్రాచలంపై ప్రేమను చూపిస్తున్నారని,.. ఇప్పటికీ తనకు ఫోన్ చేసి సార్ మన భద్రాద్రి, ఎలా ఉంది అని అడుగుతున్నారని వివరించారు.

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు.. ఎస్పీ గౌష్ ఆలం

ఆదిలాబాద్, సెప్టెంబర్ 11 :శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు తప్పవని, జైనూర్ ఘటనపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం హెచ్చరించారు. బుధవారం మండలంలోని కేస్లాపూర్ గ్రామాన్ని సందర్శించారు. ముందుగా నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నాగోబా దర్బార్ హాల్లో మండలంలోని ఆదివాసీ పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఆదివాసీ పెద్దల అభిప్రాయాలను సేకరించారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఆదివాసీ మహిళపై దాడి జరగడం బాధాకరమని, ఈ ఘటనపై సంయమనం పాటించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ కలిగించకూడదని సూచించారు. హత్యాయత్నం, లైంగిక వేధింపుల కేసులో ఇప్పటికే నిందితులను జైనూర్ పోలీసులు అరెస్టు చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారన్నారు.

గాంధీ ఆస్పత్రిలో బాధితురాలికి వైద్య చికిత్స కొనసాగుతోందని, అన్ని చికిత్స ఖర్చులనూ ప్రభుత్వమే భరిస్తోందని, బాధితురాలికి ఇప్పటికే రూ.లక్ష పరిహారం అందించినట్టు తెలిపారు. వదంతులను నమ్మొద్దని, రెచ్చగొట్టే సోషల్ మీడియా పోస్టులను ప్రసారం చేస్తే కఠిన చర్య తీసుకుంటామని స్పష్టం చేశారు. సోషల్ మీడియాపై జిల్లా పోలీసు యంత్రాంగం నిఘా ఏర్పాటు చేసిందని నిజానిజాలు తెలుసుకోకుండా ప్రచారం చేసిన వారిపై, వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌లపై చర్యలు తీసుకోబడతాయని, కేసులు నమోదు చేయబడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆదివాసీ జిల్లా సార్మేడీ మెస్రం దుర్గు, ఆదివాసీ సమన్వయ కర్త సీడాం భీంరావ్, ఆలయ వీరాధిపతి మెస్రం వెంకట్రావు, వడ్ గావ్ సార్మేడీ మెస్రం చిన్ను, గిన్నేరా సార్మేడీ తుంరం జుగదిరావు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ గౌడ్, సీఐ మొగిలి, ఎస్సై దుబ్బాక సునీల్, ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జిల్లా అధ్యక్షులు పూర్క బాపురావు, ఆర్మా ఖమ్ము, కనక తుకారం, తదితరులు పాల్గొన్నారు.

నేటి కందం– నేటికి అందం

మిన్నగ దక్షిణ దేశము
లన్నియు నభివృద్ధి కొరకు నాత్మీయతతో
నున్నంతలోన నెపముల
నెన్నక సహకార మిడగ నేర్పడు జయముల్

(సెప్టెంబర్ 12 దక్షిణ దేశాల పరస్పర సహకార దినం)

–రాధశ్రీ
సెల్:9494481210

చురక

మనిషి అంతటొక్కడే
మాటలన్నీ వేరువేరు
ఎక్కడి పాటక్కడ
ఏకంగా తీరు మారు
అవకాశవాద నైజం
అదే వాళ్ల దుర్వేదం
అనుమతిస్తే సమాజాన
అదే ఎంతో ప్రమాదం

–వేల్పుల నారాయణ
9440433475

'ఛాయ్ విత్ చెంగల్వల' పుస్తకావిష్కరణ

ఆదివారం రవీంద్రభారతి సమావేశ మందిరంలో "లేఖిని" రచయిత్రుల వేదిక "సరసిజ" థియేటర్ ఫర్ ఉమెన్ సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ సంజయ్ వ్యాఘ్రు సమర్పణలో శ్రీమతి చెంగల్వల కామేశ్వరి రచించిన 'చాయ్ విత్ చెంగల్వల' పుస్తకావిష్కరణలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా॥ మామిడి హరికృష్ణ, చెంగల్వల కామేశ్వరి, ఆవిష్కర్త డా॥ తనికెళ్ళ భరణి, డా॥ ఓలేటి పార్వతీశం, శ్రీమతి అత్తలూరి విజయలక్ష్మి, సరస్వతి కరవది పెండ్యాల లక్ష్మీకిరణ్ తదితరులు.

కాళోజీ సాహితీ పురస్కారానికి ఎంపికైన డా॥ నలిమెల భాస్కర్

తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక కాళోజీ సాహితీ పురస్కారానికి ఎంపికైన బహుభాషా కోవిదుడు, ప్రఖ్యాతకవి, రచయిత, అనువాదకులు, కేంద్ర సాహిత్య పురస్కార గ్రహీత డా॥ నలిమెల భాస్కర్ దంపతులను సత్కరిస్తున్న తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం అధ్యక్షులు డా॥ బుర్రా మధుసూదనరెడ్డి, కవి బొమ్మకంటి కిషన్, కవయిత్రి అనిత, తుమ్మల రమేశ్ రెడ్డి, ఎం. మహేందర్, పి. సురందర్, కె. సత్యం, అశోక్.

నేటినిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 12-9-2024

సత్యార్థ రామాయణము పుస్తకావిష్కరణ

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో బాపురమణ అకాడమీ ఆధ్వర్యంలో సోమవారం రవీంద్రభారతిలో సంత్ దత్తపాదానంద స్వామి రచించిన సత్యార్థ రామాయణము పుస్తకావిష్కరణ సభ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ, సాహితీ వేత్త డా॥ ఓలేటి పార్వతీశం విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి 'సత్యార్థ రామాయణము' పుస్తకాన్ని ఆవిష్కరించారు. శ్రీనివాస్‌గురూజీ, వేణుగోపాలాచార్యులు, ముల్లపూడి శ్రీదేవి, ఆంజనేయులు రాజు పాల్గొన్నారు.

ఘంటారవం

వాడుక భాషామతల్లి సిగలో
వేడుకైన విరజాజి
స్వాభిమాన పతాకమై ఎగిసిన
క్షుబ్ధ ధనువు కాళోజీ
వంపకమంటే పిల్లల్ని
నియంత్రించడమనుకోకు
మానసికోద్వేగ
బంధమని మరువకు
ఉన్నస్థితినే ఉత్తమమైనదంటున్నారంటే
సాహస నిర్ణయాలకు సందేహిస్తున్నట్లే
పిరికిమందు నూరిపోస్తున్నారంటే
బరిలో నిలబడలేని భయస్థులన్నట్లే
ప్రతిబంధకాలను
ప్రతిఘటించు
సంఘటనలను
సృష్టించు.

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

తెలంగాణ సాహిత్యానికి, సాహితీ సమరానికి నిలువెత్తు నిదర్శనం కాళోజీ-మంత్రి జూపల్లి కృష్ణారావు

కాళోజీ చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన నివాసంలో, స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ శాసనసభ హాలులో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డా॥నలగుంట్ల యాదగిరిరావు, బైస దేవదాసు, డా॥మామిడి హరికృష్ణ, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు , లోక కవి అందెశ్రీ, డా॥నమోజు బాలాచారి.

తెలంగాణ సాహిత్యానికి, సాహితీ సమరానికి నిలువెత్తు నిదర్శనం కాళోజీ నారాయణరావు అని, తెలంగాణ యాసకు జీవం పోసి ప్రజా ఉద్యమాలకు ఊపిరిలూదిన మహనీయుడని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కాళోజీ నారాయణరావు 110వ జయంతి వేడుకలు ప్రభుత్వ ఆధ్వర్యంలో సోమవారం రవీంద్ర భారతిలో ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో 'ప్రజాకవి కాళోజీ -మానవతా విలువలు' అన్న అంశంపై కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి జూపల్లి కృష్ణారావు కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. "స్వాతంత్ర్య సమరయోధుడిగా, సామాజిక ఉద్యమకారుడిగా, కవిగా తెలంగాణ సమాజానికి కాళోజీ చేసిన సేవలు ఎంతో గొప్పవి. దోపిడీ, నిరాదరణకు గురవుతున్న వారిలో ఆయన కలం చైతన్యాన్ని నింపింది. కాళోజీ కవితా సంకలనం 'నా గొడవ' లో ఆయన రాసిన అనేక కవితలు స్ఫూర్తివంతంగా ఉన్నాయి. కాళోజీ కవితాశక్తిని, బావుకతను, పోరాట ప్రతిభను తెలంగాణ ఉద్యమంలో ఎత్తిచూపింది" అని గుర్తుచేశారు. "అన్యాయాన్ని ఎదిరించిన వాడు నాకు ఆరాధ్యుడంటూ ప్రజల పక్షాన నిలిచి, ధిక్కార స్వరాన్ని వినిపించిన అక్షర తపస్వి కాళోజీ. ఆయన రచించిన 'నా గొడవ' పుస్తకాన్ని చదివినప్పుడు.. అది సమాజం గొడవలా కనిపిస్తుంది. ప్రస్తుత పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ధ్వంసమైన తెలంగాణ సంస్కృతిని, జీవన విధానాన్ని, విలువల్ని పునర్ నిర్మించుకుని , కొత్త తరానికి అందించే ప్రయత్నం చేస్తాం. త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారి ఆధ్వర్యంలో కవులు, రచయితలు, కళాకారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మన సమాజాన్ని పట్టి పీడిస్తున్న రుగ్మతలను పారదోలేందుకు మలో ఉద్యమానికి శ్రీకారం చుడతాం" అని వెల్లడించారు.

సాంస్కృతిక శాఖ ముఖ్యకార్యదర్శి వాణీప్రసాద్ మాట్లాడుతూ ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాష మరిచిపోతే అది హర్షణీయం కాదన్నారు.

భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతు మాతృభాష కోసం, తెలంగాణ రాష్ట్రం కోసం జీవితమంతా పోరాటం చేశారని అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం అందరం కృషి చేయాలన్నారు.

దేశ భవిష్యత్తుకు పునాదులైన విద్యార్థినీ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనడం ఆనందంగా వుందని నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు అన్నారు. రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావుగారు, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి వాణీ ప్రసాద్‌గారు మాట్లాడిన మాటలు అక్షర సత్యాలని అవగాహన చేసుకుంటే జీవితాలు విజయవంతమవుతాయని అన్నారు. కాళోజీగారి 'నా గొడవ' చదివినా, అందెశ్రీగారి "నిప్పులవాగు" చదివినా మనలో చైతన్యం కలిగి ఇసుమంతైనా ఎదుటివారికి అండగా నిలుస్తామని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సభ ఉద్దేశం నెరవేరాలన్న, కాళోజీకన్న కలలు ఫలించాలన్న మంచి సాహిత్యాన్ని చదివి మంచి ఆలోచనలను పెంచుకో వాలని సూచించారు. ఎన్ని భాషలు నేర్చినా తప్పుకాదని మాతృభాషను మరువరాదని అన్నారు.

సభలో ప్రసంగిస్తున్న పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు , లోక కవి అందెశ్రీ.

మొదటి సెషన్‌లో: తుమ్మ లూరి రాంమోహన్‌రావు, కందు కూరి శ్రీరాములు, కోట్ల వెంకటేశ్వర రెడ్డి, ఎ. పరమాత్మ చారి, రెడ్డి, శ్రీరామోజు హరగోపాల్, కె. రాధాకుసుమ, బి. సాయి శంకర చారి, డా॥ గోగు శ్యామల, రమాదేవి బుక్కపట్నం, డా॥ అరుణ కోదాటి, డా॥ కాంచనపల్లి, మౌనశ్రీ మల్లిక్, దెంచనాల శ్రీనివాస్.

మూడవ సెషన్‌లో: దేవనపల్లి వీణావాణి, తంగిరాల చక్రవర్తి, డా॥ బెల్లంకొండ సంపత్ కుమార్, పరిమి వెంకట సత్యమూర్తి, కె.వి.ఎల్. లయన్ డా॥ మేడిశెట్టి వెంకటేశ్వర్, అనంతోజు మోహనకృష్ణ, నుతారపు వెంకట నారాయణ, చిక్కోండ్రరవి, ఎస్‌కె. సలీమ, వేముగంటి మురళీ కృష్ణ, ఆకుల రాజ్‌కుమార్, యాకూబ్, ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్, ఉప్పోల్ల రమేశ్, అరుణ నారదభట్ల, మెర్సీ మార్గరెట్, పెద్దూరి వెంకటదాసు

నాలుగవ సెషన్‌లో: టి. ఆశీర్వాదం, పి.లక్ష్మణ్, జి. పరమేశ్వర్, జి. శ్రీనివాస్, ఎన్. మానయ్య, జె. రాజు, చిర్రా సతీష్, ఎం. శివ కుమార్, అవుసలి ఆంజనేయులు, అనంత దత్తాత్రేయ, జాకారం సునీత, నవీన్ గోరెంక, ఆదుల బలరాజ్, భజన రాములు, ఎ. చంద్రమోహన్ , ఎం.సంజీవులు తమ కవితలను చదివి వినిపించారు.

కాళోజీపై ప్రప్రథమంగా పి.హెచ్.డి. చేసిన జి.హెచ్.యం.సి. అదనపు కమీషనర్ డా॥నలగుంట్ల యాదగిరిరావు ''కాళోజీ జీవితం-రచనలు'' అంశంపై ప్రదాన ప్రసంగం చేసి ఆసక్తికర విషయాలను వెల్లడించారు.

ప్రజా వాగ్గేయకారుడు లోక కవి అందెశ్రీ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కాళోజీ ఒక మైలురాయి అని చెబుతూ.. తను రాసిన బొట్టు అనే కవితను చదివి వినిపించారు.

తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.నమోజు బాలాచారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సోమశిల తిరుపాల్ వ్యాఖ్యానం చేయగా రాపోలు సుదర్శన్ సమన్వయంతో నాల్గు సెషన్‌లుగా 70 మంది కవులు పాల్గొన్నారు.

రెండవ సెషన్‌లో: డా॥ పబ్బేటి మల్లిఖార్జున్, డా॥ సుంకర రమేష్, వనపట్ల సుబ్బయ్య, ఎన్.వి. రఘువీర్ ప్రతాప్, కడియం సోమన్న, రాచకొండ రమేశ్, రామకృష్ణ చంద్రమౌళి, గంటా మనోహర్ గుడిపల్లి నిరంజన్, సంగనభట్ల నర్సయ్య, కె. ఆనంద చారి, డా॥ చీదెల్ల సీతాలక్ష్మి, హిమజ మంగారి, మధుకర్ వైద్యుల, దొరవేటి, చింతపట్ల సుదర్శన్.

భక్తితోనే మనిషికి శక్తి, యుక్తి, ముక్తి-డా॥ కె.వి.రమణాచారి

బండారుపల్లి రామచంద్రావు రచించిన ఆత్మీయ రూప, ఆనందప్రభ "శ్రీ శ్రీనివాస శరణుమంజరి" "-1 అప్తరూప అభయవరద ఏడుకొండల శ్రీ వెంకటేశ్వర శరణుమంజరి" గ్రంథాలను ఆవిష్కరిస్తున్న రఘుశ్రీ, రచయిత బండారుపల్లి రామచంద్రరావు, బైస దేవదాసు, ఆవిష్కర్త డా॥ కె.వి.రమణాచారి, పుష్పలత, డా॥ పి. లలిత.గుదిబండి వెంకటరెడ్డి.

భక్తి అనేది సమాజంలో ప్రతీ ఒక్కరికీ ఎంతో అవసరమని, భక్తి ఎంతో గొప్పది.. భక్తి వుంటే మనిషికి శక్తి, యుక్తి, ముక్తి వాటికవే వస్తాయని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఏఎస్ అధికారి డా॥ కె.వి. రమణాచారి అన్నారు. శ్రీ మానస ఆర్ట్స్ థియేటర్స్ నిర్వహణలో రెడ్ హిల్స్‌లోని డా॥కె.వి.రమణాచారి క్యాంపు కార్యాలయంలో డా॥పి. లలితవాణి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డా॥కె.వి.రమణాచారి, పుష్పలత దంపతులు బండారుపల్లి రామచంద్రావు రచించిన ఆత్మీయ రూప, ఆనందప్రభ శ్రీ శ్రీనివాస శరణుమంజరి" "-1 అప్తరూప అభయవరద ఏడుకొండల శ్రీ వెంక టేశ్వర శరణుమంజరి" గ్రంథాలను ఆవిష్కరించి మాట్లాడారు. భక్తి అనేది దిక్సూచి, ఓదార్పు, శీతలభవనం, ఆత్మీయ స్పర్శ, ఆవల ంబనం, భక్తి అనేది హృదయానికి ఆనందానికి మధ్య సేతువు.. ఆనందమేతువు అని అభివర్ణించారు. ప్రతీ ఒక్కరికీ జన్మనిచ్చిన తల్లిదం డ్రులు, విద్యను నేర్పే గురువు, వివాహమైన తర్వాత దంపతుల మధ్య భక్తి ఉండాలని చెప్పారు. భక్తితో చేసే భోజనం ప్రసాదం, నీళ్లు తాగితే తీర్థం, భక్తితో భజిస్తే సేవ, నామస్మరణ చేస్తే జపం, ప్రయాణం చేస్తే తీర్థయాత్ర మంచిపనిచేస్తే కర్మ, మాట మంత్రవుతాయని రమణాచారి భక్తి ప్రాధాన్యతను విశదీకరించారు.

రమణాచారి దంపతులను సత్కరిస్తున్న రచయిత బండారుపల్లి రామచంద్రరావు దంపతులు

బండారుపల్లి రామచంద్రరావు రచనలు భకి, 'భక్తావేశపూర్తిమైవని అభివర్ణించారు. సీనియర్ జర్నలిస్టు బైస దేవదాసు మాట్లాడుతు ఆధ్యాత్మిక చింతనతో మనిషి దేన్నయినా సాధించవచ్చునని, మనలో కోపాన్ని, ఆవేశాన్ని తగ్గించు కుని మంచి ఆలోచనలతో జీవించ వచ్చని, ఇతరులకు కాస్తంత సహాయ సమకారాలను అందించే తత్వం అలవడుతుందని అన్నారు. ఇప్పటి వరకు బండారుపల్లి రామచంద్రరావు వెలువరించిన 7 పుస్తకాలు పూర్తిగా భక్తితో, ఆధ్యాత్మిక చింతన కలిగినవే నని రచనలు గొప్పగా వున్నాయని రామచంద్రరావును అభినందించారు.

ఈ రెండు గ్రంథాల్లో వున్న గేయ కవితలు చక్కగా పాడుకోవచ్చని, సభాధ్యక్షులు డా॥పి. లలితావాణి, గుదిబండి వెంకటరెడ్డి, రఘుశ్రీలు అభినందించారు. అనంతరం రచయిత బండారుపల్లి రామచంద్రరావు దంపతులను ముఖ్య అతిథి రమణాచారి సత్కరించారు.

నేల తడిసి ముద్దయింది

మేఘాలకు కోపమొచ్చిందో ఏమో
భూమిపై కుండపోతగా
నీరు కుమ్మరిస్తున్నాయి
ఏర్లు ఎవర్ని ముంచుదామా అంటూ
అడ్డూ ఆపూ లేకుండా
పరుగెడుతున్నాయి
అనావృష్టి ఎంతబాధాకమో
అతివృష్టి అంతేభాధాకరము
ప్రకృతి మనసు మనకర్థంకాదు
ఎందుకు కరుణిస్తుందో
ఎందుకు కోపగించుకుంటుందో
తెలిసినట్టే అనుకుంటాము
అంతలోనే మన అసమర్థత
బయట పడుతుంది
ప్రకృతిని జయించాలని
ఆరాట పడుతుంటాడు మనిషి
తెలుసుకున్నకొద్దీ తెలవనిది
చాల వుందని తెలుసుకుంటాడు
ఈ విశాల విశ్వంలో ఏముందో
ఒక్కొక్కటి తెలుసుకునే లోపల
ఏ ప్రళయమెప్పుడొస్తుందో ఏమో
అయినా,
మనిషి ఆశాజీవి ప్రయత్నం మానడు,
ఒకే చోట ఏది ఏమైనా ఆగడు

-ఎస్ .ఎమ్ .షరీఫ్
9618045319

వాన

'ఏ' వరదలు ..బురదలు... పాడు వాన...." అంటూ ,
వానను అందరూ దూషిస్తుంటే..,
నేనూ వెళ్ళాను,
నా దారిలో చెట్లముఖాల పై వాన పచ్చనిసంతకంగా మెరుస్తున్నది,
కొండల మీద నుండి జారి,
బండల మీద దరువులేసుకుంటూ నాట్య రంగస్థలమే ఐంది,
చెరువుతల్లుల కడుపుల్లోకి చేరి ,
నిండుగర్భమై రేపటి పంటలపిల్లలను మోస్తూ
భారంగా కదులుతున్నది,
ప్రాజెక్టుల గొంతుల నుండి పరవళ్ళ రాగమై దూకుతున్నది,
అలుగులెత్తుతూ చేపలవిందులను పల్లెలకు
ఉచితంగా అందిస్తున్నది.. నేనేమనగలను?
కానీ ఒకటర్థమైంది..,
పల్లము లను ఆక్రమించుకుంటే ఆస్తులైన,
అంతస్తులైనా,బిల్డింగులైనా, గుడిసెలైనా ,
అందరూ నీటికి సమానులే..,
నీరు పల్లమెరుగు, నిజం దేవుడెరుగు..!!

-డా.కాసర్ల నరేశ్ రావు
9441406252

అక్షర నివాళి

అయాచితం నటేశ్వరుడు
అక్షరమేలిన విశ్వేశ్వరుడు
వర్ణ చిత్రాల సిద్ధహస్తుడు
శిష్య గురుశిఖరోన్నతుడు
సుమధుర సుభాషితుడు
సంస్కృతాంధ్ర కోవిదుడు
బహు గ్రంథకర్త, వ్యాకర్త
వినయ, విద్యాసాగరుడు
విశ్వ విఖ్యాత బోధకుడు
గర్వమెరుగని గురుడతడు
ప్రాచ్య విద్య పరిపాలకుడు
ఆముక్త మాల్య ధారుడు
సౌందర్యలహరీ సుందరుడు
పరిశోధనలో పరమాత్ముడు
అజాతశత్రుడు,అందరివాడు
అలుపెరుగని అక్షర రుద్రుడు
పీఠాధిపతులు మెచ్చినవాడు
అవధాన విద్యాపీఠ మతడు
తెలంగాణ జ్ఞానతీర్థ మతడు
గజ మెక్కిన జగదానందుడు
అంతర్యామిగా పరిచితుడు
విద్యానిధిగా సుపరిచితుడు
బుధుడు,నృపాలపూజితుడు
ద్విజుడు,దాశరథిపురస్కృతుడు
కామరాట్పుర వరపుత్రుడు
అస్తమించని అరుణేశ్వరుడు
నింగికెగిసిన ధ్రువ తార
అయాచితం నటేశ్వరుడు

-డా. నమిలకొండ సునీత
9908468171

చాగంటి కోటేశ్వరరావుకు ఆచార్య జీవీఎస్ సాహితీ పురస్కారం

చాగంటి కోటేశ్వరరావును సత్కరిస్తున్న అతిథులు..

దృవం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాచస్పతి, బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావుకు ఆచార్య జీవీఎస్ సాహితీ పురస్కారాన్ని, ఆచార్య పి. మృణాళిని సుశీలా సుబ్రహ్మణ్యం సారస్వత పురస్కారాన్ని ప్రదానం చేశారు. మంగళవారం తెలుగు వర్సిటీ ఆడిటోరియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఏఎస్ విశ్రాంత అధికారి డా॥కే.వీ. రమణాచారి పురస్కార గ్రహీత చాగంటి కోటేశ్వరరావును సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కళలు, కళాకారులను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో పద్మభూషణ్ డా॥కె.ఐ. వరప్రసాద్‌రెడ్డి, ముక్తేవి భారతి, వెంకట్ చంగపల్లి, జె. చెన్నయ్య సౌమ్య వారణాసి తదితరులు పాల్గొన్నారు. సభకు ముందు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను అలరించాయి.

వినువీధికెగిసిన గేయ తారక

లలితశ్రీ, గేయ కిరీటి, కవనప్రజ్ఞ బిరుదాంచితులు, జాతీయస్థాయి స్పెషల్ జ్యూరీ అవార్డు గ్రహీత, కవి, రచయిత డా. వడ్డేపల్లి కృష్ణ గారి ఆకస్మిక మరణం సాహిత్యరంగానికి తీరని లోటు. గేయంగా, పాటగా పల్లవించిన ఆయన, కాలపు కర్కశత్వానికి సుడిగాలికి రాలిన పూవు వలె నేల రాలి, నక్షత్ర కాంతిపుంజమై గగన వీధుల్లోకి సాగిపోయారు. మనలను శోక తప్త హృదయులను చేశారు.

వడ్డేపల్లి గారు 1948 జూలై 30వ తేదీన కరీంనగర్ జిల్లాలోని సిరిసిల్ల గ్రామంలో ఒక సాధారణ చేనేత కుటుంబంలో లక్ష్మమ్మ, లింగయ్య దంపతులకు జన్మించారు. కృష్ణ గారు 6వ తరగతిలో ఉన్నప్పుడే సినారె గారి 'సినీకవి' అనే ఏకాంకికలో తారాపతి పాత్ర వేయడంతో పరోక్షంగా ఆయనతో అవినాభావ సంబంధం ఏర్పరచుకున్నారు. హైస్కూలులో అనంతరాయ శర్మ గారి వల్ల పద్య ఛందస్సు పట్టుపడింది. చిన్ననాటనే **"సమో నమో శ్రీ రమణ / చూపుము నాపై కరుణ"** అని ఊళ్లోని వేంకటేశ్వర స్వామి మీద గేయం రాసి, అందరి ప్రశంసలు పొందారు. స్కూల్ మ్యాగజైన్ **'తరంగిణి'**లో 1964 లో **'విధి లిఖితం'** కథానిక అచ్చు కావడం ఆయనలో కథారచనకు శ్రీకారం చుట్టింది.

డా. సి. నారాయణరెడ్డి గారి పట్ల వల్లమాలిన అభిమానం కలిగిన కృష్ణ గారు ఆయన ప్రోత్సాహంతో మొదటి సారి మాత్రా ఛందస్సులో **"నేటికాలం ఏటి కాలం/ గొడ్డు కాలం గడ్డు కాలం"** అని గేయం రాస్తే అది 'కృష్ణాపత్రిక' లో అచ్చు అయింది. ఆనాటి నుండి ఆయన వెనుతిరిగి చూసుకోలేదు. పోస్టల్ డిపార్టుమెంటులో ఉద్యోగం చేస్తున్న ఆయనతో సినారె గారు **" పోయెట్ గా రాణించాలంటే అకడమిక్ లైన్లో రావాలి"** అన్న మాటలను శిరోధార్యంగా భావించి బిఎ, ఎమ్ ఎ. పూర్తి చేశారు.

విశాఖపట్నంలో పౌర్ణమి సమయంలో సముద్రపు కెరటాలను చూసి

"శిథిల శిల్పాల దాగిన కథల గూర్చి ఎవడెరుగును"

"చితికిన బతుకుల లోని వెతల గూర్చి ఎవడెరుగును"

"సంద్రము చంద్రునకు గల సంబంధం ఎవడెరుగును"

"నీకు నాకు వీలు కాని, లోకానికి కానరాని, విధిని గూర్చి ఎవడెరుగును" అని రాసిన గేయం గొప్ప తాత్త్వికతతో కూడి ఆలోచింపజేస్తుంది. ఆ గేయాన్ని చూసి సినారె గారు ఆయనను "నీలో కవితాగుణం పెరిగింది''. అని ఎంతగానో ప్రశంసించడం ఆయనలో ఆత్మ విశ్వాసాన్ని ఇనుమడింప జేసింది. అది 'స్రవంతి' పత్రికలో అచ్చు అయింది.

ఆకాశవాణిలో కృష్ణశాస్త్రి, బోయిభీమన్న, దాశరథి, సినారె వంటి వారి లలితగీతాలు వినిపిస్తూ ఉండడం చూసి తను కూడా లలితగీతాలు పంపుతుంటే అవి తిరుగు టపాలో వచ్చేవి. అందులో "It does not reflect upon your merit" అనే ప్రింటెడ్ మ్యాటర్ చూసి కసి పెరిగి, కృషి పెరిగి నాలుగైదు సార్లు ప్రయత్నిం చాక రెండు సెలెక్ట్ అయినాయి. అందులో

"కనులు తెరిచి ఒక్కసారి కనరా నీదేశం / మనసులోని మంచి నెంచి వినరా సందేశం" అనే దేశభక్తి గీతం ఒకటైతే

"వర్షించవె మేఘమా! పరిచేలు ఫలించగ, వనములు చిగురించగ, మనముల నల రించగ" అనే ప్రకృతి పరమైనది రెండవది. అలా 1969 జనవరి నుండి ఆకాశవాణిలో లలితగేయాలు వరుసగా ప్రసారమయ్యాయి. 1972 సెప్టెంబర్ లో **"జగతి రథం జైకొడుతూ / ప్రగతి పథంపై పోనీ / ప్రగతి పథం పైన జగతి పండు వెన్నెలై రానీ /"** అనే పాట 'ఈ మాసపు పాట' గా సెలెక్ట్ అయి ఆ నెలంతా ప్రసారమయింది. దానికి ప్రముఖ గాయకుడు చిత్తరంజన్ స్వరాలు కూర్చి పాడారు. 1975 లో రేడియో వాళ్ళు **"జాతీయ బాలల సామూహిక గానం"** కోసం పాట రాసి ఇవ్వమనడంతో

"మనమంతా ఒక్కటనే మంచి మనసు పెరగాలి / జగమంతా ఒక్కటనే మంచిరోజు రావాలి" అని రాసిన పాట ఆలిండియా రేడియోలో అన్ని భాషల్లో మారుమోగడం ఆయన జీవితంలో అరుదైన ఘట్టం.

డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ యాదిలో...

ప్రముఖ కవి, సినీ గేయరచయిత, దర్శకులు డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ గారితో ప్రముఖ కవి, రచయిత, విమర్శకులు దాస్యం సేనాధిపతి 2017లో జరిపిన ఇంటర్వ్యూను యధాతథంగా పాఠకుల కోసం అందిస్తున్నాం.... – సంపాదకులు

ప్రతిభావంతులకే పురస్కారాలు దక్కాలి....

వివిధ సంస్థలే కాక, ప్రభుత్వం కూడా సాహితీ పురస్కారాలను ప్రతిభావంతులను పక్కనబెట్టి, ఆశ్రిత జనులకే అందివ్వడం జరుగుతోందని.. భజన పరులకుగాక, సృజనకారులకు పురస్కారాలు దక్కాలని ప్రముఖ కవి, సినీగేయ రచయిత, దర్శకులు డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ అభిప్రాయపడ్డారు. తన 16వ యేటనే అంటే 1965లో రచనలు ప్రారంభించారు. తాను పుట్టినట్టి సిరిసిల్ల వాతావరణం మానేరు తీరం ఆయనలో కవితా శ్వాసను నింపింది. 1968లోనే 'స్రవంతి' మాసపత్రికలో ఆయన కవితా గేయం ప్రచురించబడటం విశేషం. తొలితరం కథా రచయిత గూడూరి సీతారాం గారి స్ఫూర్తితో డాక్టర్ సి. నారాయణరెడ్డి గారి ప్రేరణతో పాటల వైపు, ఆయన విద్యాగురువు అనంతరాజు శర్మగారి ప్రోత్సాహంతో మాత్రా ఛందస్సుతో పద్య–గేయ రచనలవైపు దృష్టి మళ్లించిన ఆయన ఇంత వరకు 21 గ్రంథాలను వివిధ ప్రక్రియల్లో ప్రకటించారు. మరో ఆరు గ్రంథాలు ప్రచురణలో వున్నాయి. దాదాపు 60 సినిమాల వరకు 200 సినీగీతాలను రాశారు. 50 టివి ధారావాహికలకు, 15 డాక్యుమెంటరీలకు దర్శకత్వం వహించారు. రేడియో, టివి లలిత సంగీతానికి వేయి వరకు లలిత గీతాలను రాశారు.

'ఆటా', 'తానా' లాంటి అమెరికా తెలుగు సంస్థలకు అనేకసార్లు 'స్వాగత గీత' సంగీత నృత్యరూపకాలు రచించి అంతర్జాతీయ స్థాయి గుర్తింపును పొందారు. ఇటీవల న్యూజెర్సీ (అమెరికా) ప్రభుత్వం లండన్ పార్లమెంటు కూడా కృష్ణగారి సేవలను గుర్తించి సత్కరించింది. వృత్తిరీత్యా తపాల శాఖలో ఉన్నతాధికారిగా రిటైరైన ఆయన పుట్టిన మట్టిమీది మమకారంతో 'కాంతి జనితం మన కరీంనగరం–క్రాంతి భరితం మన కరీంనగరం' అనే గీతాన్ని రచించి అందరి మన్ననలు పొందారు. 2005లో 'ఎక్కడికెళ్తుందో మనసు? ప్రేమకే తెలుసు' అనే చలనచిత్రానికి.. ప్రస్తుతం విడుదలకు సిద్ధమైన 'లావణ్య విత్ లవ్ లవ్ బాయ్స్' అనే సినిమాకు రచనతో పాటు దర్శకత్వం వహించారు.

పేక్షకాభిరుచికై 'ప్రేమ' చుట్టే కథలు అల్లినప్పటికీ కొనవెరుపు సందేశం సంఘటితపరచడం ఆయన ప్రత్యేకత ! పద్యం కంటే పాటే ముందు పుట్టింది కాబట్టి మొదటి నుండి పాటవైపే మొగ్గు చూపుతున్నట్లు ప్రకటించినారు.

దాస్యం : వచన కవిత్వానికి ఉండాల్సిన లక్షణాలను తెలుపుతారా ?

డా.వడ్డేపల్లి: వచన కవిత్వానికి ఉండాల్సిన లక్షణాలు ప్రధమంగా అంతర్లయ, అర్థవంతమైన పద ప్రయోగం! ప్రస్తుతం మినీ కవితలే 'నానీల' నామాంతరంగా వ్యాప్తి గాంచుతున్నాయి ! కానీ నానీలకైనా.. మినీ వచన కవితలకైనా పద్యాల మాదిరిగా అక్షర నియతి అవసరం లేదని నా అభిప్రాయం !

దాస్యం : మీరు రచించిన లలిత గీతాల్లో మీకు బాగా నచ్చిన గీతం ?

డా.వడ్డేపల్లి: రేడియో, టీవీల్లో నా లలిత గీతాలు ప్రసారమైనాయి! నా లలిత గీతం 'మనమంతా ఒక్కటనే మంచి మనసు పెరగాలి' పల్లవితో ఆకాశవాణి అన్ని కేంద్రాల ద్వారా అన్ని భాషల్లో 1995 సెప్టెంబర్ నెలంతా ప్రసారమైంది. అదే గీతం నాకు జాతీయ గుర్తింపును తీసుకొచ్చింది.

దాస్యం : మీకు నచ్చిన కవి ? గ్రంథం ?

డా.వడ్డేపల్లి: నాకు నచ్చిన కవి పోతన.. ఆధునికంగా నచ్చిన గ్రంథాలు శ్రీశ్రీ 'మహాప్రస్థానం'.. సినారె 'విశ్వంభర'.

దాస్యం : ఇప్పుడొస్తున్న వచన కవిత్వంపై మీ అభిప్రాయం ?

డా.వడ్డేపల్లి: ఇప్పుడొస్తున్న వచన కవిత్వం చేయి తిరిగిన వారి చేతుల్లో హాయిగా అర్థవంతంగా నటిస్తూ అలరిస్తుంటే, కేవలం జిజ్ఞాసతో – తమ కవితల్ని అచ్చులో పత్రికల్లో చూసుకోవాలన్న ఆశతో రాస్తున్న వారి చేతుల్లో ఉడికీ.. ఉడకని అన్నంలా తోస్తూ పెదవి విరిచేలా వుంది !

దాస్యం: మీరు పొందిన సాహితీ పురస్కారాలు ?

డా.వడ్డేపల్లి: చాలా సంస్థలు సాహితీ పురస్కారాలను అందించాయి. వాటిలో వచన కవితలకు సంబంధించి 'హాలాహలం' (కవితా సంపుటి) దేవులపల్లి పురస్కారం వచ్చింది. 'వడ్డేపల్లి కవితకు' సాహితీ గౌతమి (కరీంనగర్) సినారె పురస్కారం వచ్చింది.

దాస్యం : మీరు పాటలు, కవితలు, పద్యాలతో పాటు 'పాట వెలదులు' సృష్టించారు కదా! మచ్చుకు ఒకటి చెబుతారా?

డా.వడ్డేపల్లి: నా స్వీయ ప్రతిభతో 'పాట వెలదులు' అనే నవీన పద్యాలను సృష్టించాను –మచ్చుకు...లేచు – 'పల్లెలందు వీచు పైరగాలి / పట్నం మందు లేచు పొడుగాలి. ప్రియము గాను మనిషి పీల్చుగాలి / కలుషితమ్ము ఆమె కర్మగాలి!'

దాస్యం : తెలంగాణ సాహిత్యం వెలుగులోకి రావాలంటే ఏం చేయాలి ?

డా.వడ్డేపల్లి: బావిలో పడ్డ బొక్కెనను 'పాతాళ గరిగె'లో పైకి తీసినట్లు సాహితీ వ్రతులంతా మరుగున పడ్డ తెలంగాణ సాహిత్యాన్ని పైకి తీయాలి. వీలైనంత వరకు విజ్ఞుల ద్వారా విషయాల్ని సేకరించాలి. ప్రామాణికంగా ప్రచురించాలి.

దాస్యం : సాహితీ పురస్కారాలపై మీ అభిప్రాయం ?

డా.వడ్డేపల్లి: ప్రతిభ ఉన్న వారిని ప్రక్కన పెట్టి – ఆశ్రితజనులకే పురస్కారాలు అందించే పద్ధతికి స్వస్తి పలకాలి. 'ఇజాల'తో 'గ్రూపు'లలో భుజాలు కలిపి తిరిగేవారికే భుక్తిని ముక్తిని ప్రసాదించే ప్రహసనం అణగారాలి! భజనపరులకు గాక సృజనకారులకు పురస్కారాలు దక్కాలి. అలా దక్కాలంటే... ఒకే వర్గానికి సంబంధించిన వారికి గాక సమ్యక్ దృష్టిగల నిపుణుల్ని న్యాయనిర్ణేతల్ని నియమించాలి.

దాస్యం : కొత్త కవులు రచయితకు శిక్షణ అవసరమా ?

డా.వడ్డేపల్లి: ఔను అవసరమే ! అత్యవసరం కూడా ! భాష పట్ల అవగాహన కలిగించాలి. శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేయాలి.

దాస్యం : కొత్త కవులు రచయితలకు మీరిచ్చే సలహాలు? సూచనలు ?

డా.వడ్డేపల్లి: అధ్యయనం చేయాలి.. భాషాపరిజ్ఞానాన్ని పొందాలి. వ్యాకరణాన్ని – ఛందస్సుల్ని వద్దని శ్రీశ్రీ చెప్పాడని.. విస్మరిస్తే.. పునాది లేని భవనంలా అచిరకాలంలోనే కుప్పకూలడం ఖాయం.. కనుక పూర్వ కవులు, రచయితల రచనలు బాగా చదవాలి. మెలకువలు తెలుసుకోవాలి.

– దాస్యం సేనాధిపతి
9440525544

వెండితెర పైన డా. సి. నారాయణరెడ్డి అని ఉన్నట్లు తన పేరు కూడా... డా. వడ్డేపల్లి కృష్ణ అని చూసుకోవాలనే కోరికతో 'లలితగీతాలు' అంశాన్ని పి హెచ్ డి కి అంశంగా తీసుకున్నారు. అంతకుముందు నిర్దిష్ట లక్షణాలు లేని లలితగీతాలను గురజాడ నుండి మొదలుపెట్టి 90 ఏళ్ల సాహిత్యాన్ని తలకెత్తుకొని ప్రామాణిక లక్షణాలను ఏర్పరిచారు. గైడ్ గా వ్యవహరించిన ఆచార్య ఎస్వీ రామారావు గారు **" గేయ రచనలోనే కాక విమర్శనా దృక్పథంలో కూడా మంచి వన్నెకెక్కినవాడు అనిపించు కున్నాడ"** ని ప్రశంసలు కురిపించారు. కృష్ణ గారి పట్టుదలకు, కృషికి ఇది ఒక మంచి ఉదాహరణ.

ప్రముఖ సినీ తార జమున గారు కృష్ణగారి గురించి విని, సినిమాలో పాట రాయడానికి అవకాశం ఇచ్చారు. ఆమె ఇచ్చిన ట్యూన్ కి అనుగుణంగా..

"నీవే లేని ఈ జీవితమే కలయై కరిగెనుగా, నాలో కలతై మిగిలెనుగా / పల్లవి లేని పాటగ వలపే తాళం తప్పెనుగా, దేవీ రాగం మారెనుగా" అని రాసివ్వగా ఆమె ఎంతగానో మెచ్చుకొని పాట మొత్తం రాయించుకున్నారు. అలా మొదలైన సినీ ప్రస్థానం ఆయనకు ఎన్నో మధురానుభూతులను అందించింది.

'మణిరత్నం' మొట్టమొదటి డైరెక్షన్ లో వచ్చిన సినిమా 'పెద్దరికం'. దాంట్లో " ముద్దుల జానకి పెండ్లికి మబ్బుల పల్లకి తేవలెనే, ఆశల రెక్కల హంసలు పల్లకి మోసుకుపోవలెనే" అనే పెళ్లి పాట ఆయనకు అమితమైన కీర్తినందిం చింది. గూగుల్ సర్వేలో ఇప్పటి వరకు వచ్చిన పెళ్లిపాటల్లో ఇది టాప్ టెన్ లో ఉండడం విశేషం.

కృష్ణగారు ఇప్పటివరకు దాదాపు 40 కావ్యాలు, 60 కి పైగా సంగీత నృత్య రూపకాలు, 60 రేడియో ఆల్బమ్స్, 15 వరకు డాక్యుమెంట్స్, 96 టీవీ సీరియల్స్ రచన చేయడమే కాక అందులో 30 సీరియల్స్ కి దర్శకత్వం వహించారు. కరోనా కాలంలో తెలంగాణా ప్రముఖ కవులు, కావ్యాలు పంపన కవి నుండి మొదలుకొని క్రీ. శ. 941 నుండి 2010 వరకు గల కవుల జీవితాలు రచనలు, తెలుపుతూ 500 పేజీల పుస్తకం రాశారు. 'చిరుగజ్జెలు' పేరుతో రాసిన బాలల పాటలకు అవార్డు వచ్చింది.

2014 లో తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావ సందర్భంగా "జయజయహే తెలంగాణ" అనే పేరుతో 60 ఏళ్ల తెలంగాణ చరిత్రను రూపకంగా రూపొందించారు.

1976 లోనే తెలంగాణ వ్యావహారిక భాషలో 'వెలుగొచ్చింది' అనే నాటిక రచన చేయడం ఒక సాహసం.

విదేశాల్లో కూడా ఆటా తానా వంటి సభలకు స్వాగత గీతాలు రాశారు. నృత్య రూపకాలన్నింటినీ రాయడమే కాక పూర్తి రూపకల్పన ఆయనే చేయడం విశేషం. కరీంనగర్ జిల్లా వాసి కావడాన దేవాలయాల్లో భక్తి పాటల రికార్డు ఉండాలని, జిల్లాలోని క్షేత్రాలపై ఆడియో సీడీ తయారు చేశారు.

ఇటీవల 75 ఏళ్ల స్వతంత్ర భారత అమృతోత్సవంలో కూడా ఆకాశవాణిలో 'ఈ మాసపు పాట' రాసే అదృష్టం ఆయనను వరించింది.

"ఎత్తరా మన జెండా వినువీధుల నిండా / ఎలుగెత్తరా భారతీయ భావం ఎదనిండా" అని ఆయన రాసిన పాట ఆకాశవాణిలో ప్రసారమైంది. **"ఆకాశవాణి అమ్మలా లాలించింది. దూరదర్శన్ తండ్రిలా పోషించింది. పత్రికలు మిత్రుల్లా ప్రోత్సహించాయి"** అంటూ "సినిమా రంగం అప్పుడప్పుడు ప్రియురాలిలా పీడిం చింది" అని నవ్వుతూ చెప్పేవారాయన.

ఆయన నటులుగా కొన్ని చిత్రాలలో నటించి, తమ నటనా సామర్థ్యాన్ని చాటుకున్నారు. ఇటీవల విడుదలై అందరికీ కుటుంబ విలువలను అందించిన 'బలగం' సినిమాలో కూడా నటించారు.

వడ్డేపల్లి కృష్ణ గారి సతీమణి మణెమ్మ. ఇద్దరు కుమారులు శ్రీనాథ్, శ్రీకాంత్, కుమార్తె వాణి. కుమారులిద్దరూ మంచి ఉద్యోగాలు చేస్తూ అమెరికాలో స్థిరపడ్డారు. కొన్నేళ్లుగా ఆయన హైదరాబాద్ లోని నాగోల్ ప్రాంతంలో నివసిస్తున్నారు.

ఈ సంవత్సరం జూన్ లో 'ఆటా' వేడుకల కోసం అట్లాంటా వెళ్లి స్వదేశానికి తిరిగి వచ్చిన ఆయన అనారోగ్యానికి గురై, విధి వంచించి హఠాన్మరణం చెందడం కుటుంబ సభ్యులను, అభిమానులను తీవ్ర దుఃఖంలో ముంచేసింది.

అంతకు రెండురోజుల ముందే తెలుగు సినీ రచయితల సంఘం నుండి జీవన సాఫల్య పురస్కారం పొందిన ఆయన ఆ ఆనందాన్ని అనుభూతిపరం చేసుకునే లోపే స్వర్గస్థులు కావడం విచారకరం. ఎప్పుడూ ఏదో చేయాలని తపించే ఆయన ఇలా దూరం కావడం దురదృష్టకరం. ఆయన మనలను వీడినా గేయంలా, పాటలా మన హృదయాలలో నిరంతరం పరిమళిస్తూనే ఉంటారు.

"జ్ఞాపకానికి మరణం లేదు" అన్నట్టు ఆయన మరణించినా అక్షరంగా, చైతన్య దీప్తిగా వెలుగుతూనే ఉంటారు.

– ధూళిపాళ అరుణ
8712342323

"అమరావతి సాహితీమిత్రులు" సంస్థ అధ్యక్షులు డా॥ రావి రంగారావు ఫేస్బుక్ గ్రూప్ లో నిర్వహిస్తున్న "వారం వారం వచన కవితల పోటీ"లలో ఎంపికైన "వాన" పై మంచి కవితలు...

ఏమిటో నాకేమీ అర్థం కాదు ఈ వాన

ఏమిటో నాకేమీ అర్థం కాదు ఈ వాన,
ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో...
ఎండలు మండుతున్నాయి కదా,
అసలే మే నెల అని వడియాలు పెట్టాలనుకుంటే,
కొంపలు మునిగినట్లు, పెనిమిటి గదిమినట్లు
పరుగెత్తుకు వచ్చింది మాయదారి వాన.
ఏమిటో నాకేమీ అర్థం కాదు ఈ వాన,
ఆడపడుచులా అక్కసు ఎక్కువేమో,
మాగాయకు సిద్ధం చేసుకున్న ఆడవారినందరని
అదరగొడుతోంది ఈ వాన...
ఏమిటో నాకేమి అర్థం కాదు ఈ వాన,
ఎండలు వెళ్ళినాయి పంట పొలములో
విత్తులు నాటుదామంటే
సరిగా నేలనైన తడపకుండా
ప్రియుడెవరో పిలిచినట్లు
పారిపోయినాది పిసినారి వాన...
ఏమిటో నాకేమి అర్థం కాదు ఈ వాన,
వంటలొద్దు, పొడు వద్దు, పట్టం పోయి
పనీ పాట చేసుకుంటూ బతుకుదామని వెళ్ళబోతే,
పల్లెల్లో నువ్వు లేకుంటే నాకు పొద్దు పోదు అన్నట్లు
అప్పుడప్పుడు
చుట్టం చూపుగా వచ్చి వెళ్తాది
వయ్యారాల వాన...
ఏమిటో నాకేమీ అర్థం కాదు ఈ వాన,
అయినవారు, పరాయివారైనా?
వాన నాకు తోడుగుందిలే అని
పంట చేతికొచ్చే దాక పండించుకొని
కోత కోయబోతే,
పిలవని చుట్టంలా మేఘాలతో
ముంచుకొచ్చింది వాన?.
ఏమిటో నాకేమీ అర్థం కాదు ఈ వాన,
అమ్మమ్మ గారింట్లో బాగుంటుందని
పిల్లలకు సర్ది చెప్పి,
ఊరికి వెళ్లి, మేడ మీద నీళ్లు చల్లి,
పక్క లేసి పడుకుంటూ,
చిన్ననాటి కబుర్లు అన్ని చెప్పుకుందాం అనుకుంటే,
పైత్యం ఉన్న పక్కింటోడు నవ్వినట్లు
పటపట చినుకులు రాలుతూ కురుస్తుంది వాన...
ఏమిటో నాకేమీ అర్థం కాదు ఈ వాన,
పొరిగింటోళ్ల పెళ్లి కని పసుపచ్చ చీర కట్టుకొని,
పసిడి లేదని, పరువు పోతుందని,
పూతపోసిన నగలు పెట్టుకుని
పిల్ల పాపలతో పేరంటానికి వెళితే,
కుళ్లుకుంటున్న తోడికోడల్లా కమ్ముకొస్తూ
కడలి నిండే అంతగా వచ్చింది కుళ్ళుబోతు వాన?
ఏమిటో నాకేమీ అర్థం కాదు ఈ వాన,
ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో.

-అనుశ్రీ మెండు

వ(హ)ర్షానుభూతి

వాన బిడ్డకు ఎన్ని పేర్లో....
పుట్టినప్పుడు ముద్దుగా "చినుకు"
దొగాడుతూ ఉంటే "చిరుజల్లు"
తడబడు నడకలైతే "తుప్పర"
వడివడిగ నడుస్తూ ఉంటే "వర్షం"
గంతులేస్తూ పరుగులెత్తితే "కుంభవృష్టి"
వాన కురిస్తే ఎన్ని అనుభూతులో...
చినుకులు మొదలౌతూ ఉంటే ఆకాశం
అక్షతలను తలపై చల్లుతున్నట్లు అనిపిస్తుంది
చిరుజల్లు చిలకరిస్తూ ఉంటే
వచ్చే మట్టి వాసన
భూమితల్లి పిలిచినట్లు అనిపిస్తుంది
తుప్పర వస్తూ ఉంటే
కొంచెమైనా ఒళ్ళూ గొంతూ
తడుపుకోమని చెప్పినట్లు అనిపిస్తుంది.
వర్షం పడుతూ ఉంటే
పారుతూ ఉండే నీరు
నేలను కడుగుతున్నట్లు అనిపిస్తుంది.
కుంభవృష్టి కురుస్తూ ఉంటే
ఇంక చాలు బాబూ వెళ్ళు
అంటూ పెట్టాలి చీవాట్లు అనిపిస్తుంది.

-గోలి హనుమచ్ఛాస్త్రి, గుంటూరు

వాన

అడుగంటిపోయిన మనిషిలోని
మానవత్వాన్ని తట్టి లేపి
కరుణార్ద్ర హృదయంలా..
ఎండిపోయిన పుడమి గర్భాన్ని
చిరుజల్లుల లాలనతో తడిపేస్తూ
కురిసే అనురాగ వర్షం..
జవమై జీవమై ప్రాణకోటి మనుగడకు ఆలంబనై
కలవరపడుతున్న కన్నుల్లో
పరవశాలను నింపే మేఘాల విన్యాసం..
ఆశ నిరాశల సేద్యంలో
ఊగిసలాడే రైతన్నకు వరమై..
వడలిపోయిన అవని బిడ్డను ఊరడిస్తూ
ప్రకృతి మాత కురిపించే మమతాను రాగ హర్షం..
గుండె మంటలను చల్లార్చుతూ
వాగై వరదై ముంచేస్తూ
ఎండిన పుడమి దాహాలను తీర్చేస్తూ
కలత నిండిన కన్నులలో కాంతి నింపి
పులకరింతలను పంచే
చిరునవ్వు చిరుజల్లు లాస్యం...
ఉరుముల మెరుపుల గర్జనలతో ఉరకలు వేస్తూ
కమలిన అవని వధువుకు
పచ్చని చీరలు సొబగులు అద్దేందుకు
ముత్యాల ధారలై ముంగిట జారే వాన...
ఆకుల కొసలో ముత్యాలు పూయుతూ
కేరింతలు కొట్టే చిన్నారుల వదనంలో
తారక లవుతూ
ఆకలి మంటలు చల్లార్చే
అమృత భాండ మయ్యేను...
ప్రకోపించిన వేళ
ఉగ్రమై పెనుభూత మయ్యేను,
ప్రేమించిన వేళ తానే పెన్నిధై
కల్ప తరువయ్యేను.

-మైథిలి, గుంటూరు

జీవ ధార

ఉక్కబోతల ఉక్కిరిబిక్కిరిలో
సలిగిన నీటియావిరులు రూపు కట్టేందుకు
ఆకాశంలోకి దూసుకుపోయాయి,
స్వచ్ఛంగా పుట్టడానికి
కొండలమీద తావు చూసుకుని
మేఘాల తెరలు గట్టుకుని
చెట్ల కొమ్మల మీద మనసు పారేసుకున్నాయి...
ఏరు ఎక్కడో తప్పిపోయిందని
బేలగా మొగలుకు ఎదురుచూస్తున్న
రైతన్న నొసటన చిలిపి ముద్దు పెట్టింది తొలకరి...
చినుకుల తాళంలో
ఉరుముల మేళంతో
మెరుపు కన్యలు గగన మంతా నాట్యం చేస్తోంటే
భూమి, ఆకాశం సరిహద్దులు చెరిపేసుకుని
ఏకమైపోయాయి...
పసిపిల్లల కాగితపు పడవల్లో నవ్వులు మోస్తూ
పడుచువారి ప్రణయ భావాల ప్రేమ లేఖలోని
అక్షరాల్లో కలిసిపోతూ
భూమినుండి పుట్టే
కొత్త మొలకల కలల్లో నిండిపోతూ
జన మంతా మందహాసధరులై
పశుపక్ష్యాదుల ఆనందం స్మృత్యాయి చేస్తూంటే
ప్రకృతి పరశిస్తూ ఆస్వాదించేలా కురిసింది వాన
పుడమి పంటలకు జీవధారగా జగాన...!!

-రమాదేవి బాలబోయిన

ద్వైత వాన

ధరణికి మేఘ సందేశం అందింది
మేఘం కరి రంగు పులుముకుంది
రెండు కొండలు ఢీకొనట్టు ప్రళయ ఘర్జన
దశ దిశలా వ్యాపించింది
ధరణీ తలం పులకించి పరవశించింది,
వృక్ష రాజాలు ఊయల లూగాయి
తరుణీ లతలు ఆహ్వానం పలుకుతున్నాయి,
భానుని ప్రతాపం తాళలేక
ఎప్పటి నుండో చకోర పక్షిలా ఎదురు చూస్తూ
భూమి కలలు కన్న తొలకరి
ఎదను తాకిన స్పర్శానుభూతి
పుడమి ఒడిలో కురిసి మురిసి
బతుకు మెతుకును స్వాగతించాయి...
అకాలపు చినుకేదో
పీడకలై విజృంభించింది
చినుకు చినుకుకు గాలి తోడై
ప్రళయ భీకర రూపం దాల్చింది
ఆకాశానికి చిల్లు పడిందా అన్న చందంగా
కుండపోత వాన
వరుణుడు ఆగ్రహించినట్టు...
కళ్ళాల్లో ధాన్యం చిరు వాగులై పారాడింది
చేతి కొచ్చి చేజారిపోతున్నా
గుండె బాదుకోవడం తప్ప
యేం చెయ్యలేని రైతన్న
కంటినుండి రాలిన కన్నీళ్ళు
ప్రళయ భీకర జలపాతాల్ని తలపిస్తున్నాయి
అలిసిపోయి గుండె ఆగిపోయింది...
అదేమిటో!వానా మాయమై పోయింది!!.

-బంగారు వి బి ఆచార్యులు,

చేతికి చిక్కని చక్కనమ్మ

ఆకాశం తన నివాసం,
అవనికి తను నేస్తం
తన రాక ఎప్పుడూ రహస్యమే,
వచ్చిందంటే అంతా బహిరంగమే!.
చంటిపాప బోసినవ్వు లాంటి సొగసు తనది,
అందుకే అందరికి మన సౌతుంది.
తనను చేయి చాచి అందుకోవా లని
తనతోపాటు అల్లరి చేస్తూ ఆటలాడా లని
కానీ చేతికి చిక్కని చక్కనమ్మే తను!!.
ఆకాశము నుండి వెండి మువ్వలతో
ఘల్ ఘల్ మంటూ నేలకు దిగుతుంది,
తన తొలి తొలి అడుగులు
తొలకరి జల్లులతో
అవని తల్లిని పులకింప చేస్తుంది...
పంట పొలాల దాహాన్ని తీరుస్తూంది.
పదపద మంటూ ఏరువాకకు
పచ్చ జెండా ఊపుతుంది
అందరికి అన్నం పెట్టె రైతన్న కళ్ళల్లో
ఆనందాలు పండిస్తుంది!!
బేధాలు లేని స్వచ్ఛమైన నడకలు తనవి,
ఊరువాడ కొండకోన లన్నింటిని పలుకరిస్తుంది,
తన ప్రేమతో వాగు వంకలను నింపేస్తుంది.

జీవనాధార జలధార

నింగిని నేలను కలుపుతూ
జలతారు దారాల వర్ష ధార...
మట్టి సుగంధాన్ని తట్టిలేపుతూ
గ్రీష్మ తాపంతో ఎండిన
ప్రకృతి గొంతును తడుపుతూ
అన్నదాతల కన్నీటి ధారను ఉపశమింపజేస్తూ!.
చిటపట చినుకులు
పత్రాలపై ముత్యాల సరాల్లా మెరుస్తూ...
తటాలున మెరిసే తటిల్లతలతో
తనువును పులకరింపజేస్తూ...
హఠాత్తుగా విరిసే హరివిల్లులతో
సంభ్రమాన్ని కలుగజేస్తూ...
తడిసిన తరూ లతల లావణ్యం
తలారబెట్టుకుంటున్న తరుణిని స్ఫురింపజేస్తూ...
యువతీ యువకుల తపనకు తాళ మేస్తూ!.
కాగితపు పడవలతో ఆనందించిన
బాల్యాన్ని గుర్తుకు తెస్తూ...
వేడి వేడి మొక్కజొన్న పొత్తుల
ఆస్వాదాన్ని అందిస్తూ...
జలవనరుల జలకళతో కళకళలాడుతూ...
జీవరాసులకు నూతన చైతన్యాన్ని చిలకరిస్తూ!.
జోరున కురిసి చూరు క్రింద
కారే వాన నీటిని పాత్రల్లో పట్టుకుంటూ...
చలికి వణుకుతున్న పిల్లల్ని పేద తల్లి
తన కొంగుచాటున వెచ్చబెడుతూ!
భారీ వర్షానికి వాహనాలు పడవ లౌతూ...
ఈగలు, దోమల సంతతి పెరిగి
వ్యాధికారకా లవుతూ!.
కిటికీలోంచి చూస్తూ వేడి పానీయాన్ని
చప్పరిస్తూ కొందరు...
బ్రతుకు పోరాటంలో తప్పక తడుస్తూ
చలికి వణికే వారింకొందరు!
గొడుగులతో కొందరు...
గోనెసంచులతో కొందరు...
రైన్ కోట్లతో కొందరు...
ప్లాస్టిక్ షీట్లతో కొందరు...
వానచినుకుల ఉద్ధృతి నుండి రక్షించుకుంటూ!
ఇబ్బందు లెన్ని సృష్టించినా...
జీవనాధార జల ధార నిత్య నూతన
సమ్మోహన దృశ్యమే!.

-చంద్రకళ. దీకొండ, మేడ్చల్.

రహస్యపు వాన

రాత్రి కురిసిం దొక రహస్యపు వాన
నోళ్లు తెరుచుకున్న బీళ్ళన్నీ అమృతమయ్యేలా..!
ఆకాశానికి అతికించిన రైతుల చెవులు
ఆ అలికిడి కోసమే ఎదురు చూసేలా...!
తమ గొంతులు తడిపే నీటి కోసం
మొక్కలు ముఖాలు చిగురించేలా...!.
కలతల్ని మాపే కల్ప తరువులా నువ్వొస్తావని
ఒబ్బిపోయిన మనసుకు ఓదార్పు చెప్పుకుంటూ...
ఉక్కపోతతో ఊపిరందని కొమ్మలకు
వైశాఖపు వాన తడి ప్రేమను పంచడానికొచ్చింది..!.
చిటపటల్లాడే చిట్టి చినుకులు
ఆకుల చివర్న వేలాడుతూ
వాన రాగం పాడుతుంటే...
బడికెళ్లే పిల్లల్లా భలే ముద్దొస్తున్నాయి.!.
ఆశల గుటకలేస్తున్న రైతు కళ్ళు
ఆనందంతో దుక్కి దున్నాయి.!
ఆకలి పేగును చల్లార్చే అతిథికి
అర్ఘ్య పాద్యా లిచ్చి ఆహ్వానించే ప్రకృతి
పరవశించి పచ్చని చీరైంది.!.
మబ్బుల ముంతలు ఒంపేసి
జలజలా రాలే జాజి పూల వంటి
వాన మదిని గిల్లుతుంది.!
ఆ వాన నీటిలో బాల్యపు జ్ఞాపకాలు
కాగితప్పడవలై తిరుగుతున్నాయి..!.
వెచ్చని ఊహల పొత్తిళ్లలో గుచ్చెత్తేటి వాన,
భూమిని అల్లుకుంటూ బంగారాన్ని పండిస్తుంది..!
ఆనందాన్నిచ్చే వాన అప్పుడప్పుడు
అవేదననూ మిగిల్చి వెళుతుంది..!
దాహాన్ని తీర్చే చినుకు
ఉప్పెనై ఊళ్లనూ తుడిచిపెడుతుంది..!
ప్రకృతితో మనిషి జీవనం
ఎంతో సౌందర్యం..
ప్రకోపిస్తే అదే జీవితం
ఆర్ద్రత మయం..!!.

-జయసుధ కోసూరి

తడవాలని ఉంది.

మనసుపై కష్టం మబ్బులు కమ్మి
మది గదిలో కన్నీళ్లు నిండినప్పుడు
అమ్మ ప్రేమ వానలో తడవా లనిపిస్తుంది.
అమ్మ తిట్ల గాలితో వణుకుతూ ఉంటే
నాన్న వెచ్చని బుజ్జగింపు వానలో ఉన్నప్పుడు
మనసుకెంత హాయి!
శరీరం వృద్ధాప్యం ఒడ్డుకు చేరినప్పుడు
చీదరింపులు లేని అనురాగాల వానలో
జగమంతటిని పచ్చగా
భూతల స్వర్గంలా మారుస్తుంది
కరువు జాడలకు చెల్లు చీటీ రాస్తుంది!!.
అంతేనా.. ఎప్పుడు అనురాగాన్నే కాదు
అప్పుడప్పుడు క్రోధాన్ని కురిపిస్తుంది
జడిలా పట్టి జనాన్ని బంధించేస్తుంది
తుఫానుగా మారి సూర్యుడినే మింగేస్తుంది.
పేదోళ్ళ పొయ్యిలో
పుల్లను కూడా వెలుగనివ్వక
కన్నీళ్ళు పెట్టిస్తుంది
అందరికి పగలే చుక్కలు చూపిస్తుంది...
జగతికే జీవనాధారమైన ఈ వాన
ఎవరి ఆలోచనకు చిక్కని జలతారు జాణ,
అందుకే తన నడకలకు గొడుగు పట్టక తప్పదు
ఎంతటి వారికైనా.!!!.

-ఎస్ ముంతాజ్ బేగం, ఏలూరు

జీవకోటి సంజీవిని

వనం వికసించా లంటే
ఆధారం వాన
మనిషి జీవించాలంటే
ఆహారం కోసం వాన!.
కూలబడిన మొక్కని
భూమి పొరల మధ్య నుండి లాగి
వికసింప చేసేటి
సంజీవిని ధార వాన!.
ఎడారి ప్రాణుల జీవన ప్రయాణ
ఆయుష్ను ధారలే వాన,
వాన లేని ధరణి నిప్పుల కొలిమి
వాన కురవని ప్రదేశం
బీడు భూమి!
ముక్కోటి దేవతలు
ప్రాణ కోటి క్షేత్ర పాలకులు
పంచ భూతాలలో
వాన నీరే ముఖ్య దేవత!.

-రాజు కల్లూరి, ధవళేశ్వరం, తూర్పు గోదావరి,జిల్లా

వానని నిందించకు

విత్తు మీద పడి మొలకెత్తిస్తుంది
ఎదారులలో పడి అడవులను సృష్టిస్తుంది
సమస్త జీవరాశిని బతికించటానికి
అలా జాలువారి తటాకాల చేరుతుంది.
అడగకనే వేసవి..
ధూళి దూసరాలను కడిగేస్తుంది
కమ్మని మట్టి వాసనతో
మనసు పులకింపచేస్తుంది..
ముసలి బసవన్నలు నిస్సత్తువ మరిచి
రంకె వేసేలా సత్తువ నిస్తుంది
అల్చిప్పలో పడి
ముత్యంగా మెరిసి మురిపిస్తుంది...
పరుగులతో నాట్యం చేస్తూ నదులై
పల్లెల పట్నాల గొంతు తడుపుతూ
పంట పొలాల దాహం తీరుస్తూ
పునర్జన్మకై కడలిని చేరుతుంది...
అహంకారంతో ఎదురు తిరిగి
జల గమనానికి అడ్డుపడి
వరదలతో ముంచేసిందని
వెర్రికేకలు పెడతావెందుకు!
చేతనైతే చినుకులు ఒడిసిపట్టి
అమృతంగా మలుచుకో.

-వి వి రావు, గుంటూరు

వాన

నా బాల్యపుటద్దం.
వాన
నా చిరునవ్వుల చిరునామా.
వాన
నా కన్నీటికి ఓదార్పు నేస్తం...
ఎన్నిసార్లు
కాగితపు పడవనై తేలియాడానో!
ఎన్నిసార్లు
గొడుగు మరచిపోయి తడిచిపోయానో!
ఎన్నిసార్లు
వాన చినుకుకు గొంతు కలిపానో!
ఎన్నిసార్లు
జ్వరంతో స్కూలు దుమ్మా కొట్టానో!
ఎన్నిసార్లు
వానా వానా వల్లప్ప గంతులేశానో!
ఎన్నిసార్లు
వానలో హరివిల్లుకు రంగులద్దానో!
ఎన్నిసార్లు
పొలం బడిలో మడి విత్తన మయ్యానో!
ఎన్నిసార్లు
మొక్కజొన్న పొత్తుల నేస్తం అడిగానో!
ఎన్నిసార్లు
కారుతున్న కప్పు కింద గిన్నెలు నింపానో!
ఇప్పుడు వాన
బాధ్యతల వడగండ్లను మోసుకొస్తుంది.
ఇప్పుడు వాన
నాకూ లోకానికి ప్రాణాలు తీసుకొస్తుంది...
ఇప్పుడు వాన
ఎండిపోయిన భూమాత
పండగ రోజు కట్టుకున్న పచ్చని పావడా.

-ఎనికేపల్లి శివకుమార్, నందిగామ, కృష్ణా జిల్లా

ఊతకర్ర లేకుండా నడవటం
ఎంత వరమో కదా ఆ వయసుకు...
అలక బూనిన ప్రేమికులు
ఒకరిపై మరొకరు ఓదార్పు కుసుమాలు వేసుకుంటూ
వలపు కౌగిలి వానలో ఒకటై ఒదిగిపోవటం
అద్భుతమైన దృశ్యమే కదా!
గిల్లికజ్జాలనే ఎడబాటుకు దగ్గరయ్యే దంపతులు
ఒకరి ఇష్టాలపై మరొకరు ప్రేమను రంగరించుకొని
గౌరవ తాంబూలా లిచ్చుకుంటూ
వానలో నడుస్తూ ఉంటే
ఆదర్శమే కదా అందరికీ.

-చింతా రాంబాబు

తొలకరి పిలుపు

భానుడి ప్రతాపానికి
భగ భగ లాడిన పుడమి
ఆకాశవాణితో
కబురు పంపిందేమో!
దాహార్తి తాళలేక
మగత నిద్రలో ఉన్న మేఘాలు
ఒక్క ఉదుటున ఉలిక్కి పడిలేచి
తిన్నగా సాగర తీరాని కెళ్లి
కావాల్సిన నీరు
కడుపారా నింపుకుని
వర్షించి భూమాతకు
అభిషేకం చేశాయి...
చిరు చినుకుల స్పర్శకు
మట్టి పరిమళం మరింత
మైమరపింపచేసింది
ఆకలితో ఉన్న తరువులు
ఆనందంతో
సంబరాలు చేసుకున్నాయి,
గగనాని కేసి దిగులుతో చూసే
రైతన్న
తొలకరి జల్లులలో తడిసిన
నేలతల్లిని చూసి
తన్మయత్వంతో
మురిసిపోయాడు...
గ్రీష్మ తాపానికి ఎండి వాడిన
పశు పక్ష్యాదులు
వేసంగి వానకి ఎగిరి గంతేసి
వేడుకలు చేసుకున్నాయి...
పడమటి సంధ్యలో
హరివిల్లు రంగులు మనసుని
దోచేస్తుంటే
పులకరింతల తొలకరిలో
తనువు మయూరమై ఆడుతూ
హృది కోయిలై పాడుతుంది.

-వడ్డెబోయిన సుభాషిణి

వాన

గగన సీమ నుంచి జల కన్య
మెరుపు తీగలా భువికి ఏతెంచి
తనలో ఉబికే అమృత జల్లులతో
సస్య శ్యామలం గావిస్తూ
చిట పట చినుకులతో
సకల జనుల ఎదలను దోచేసే
తన గురించి ఏమి చెప్పాలి..!?
ఆహా...
తన రాకతోనే మనసులను రంజిపచేసి
వయ్యారంగా
ఉరుముల మువ్వల సవ్వడులతో
చూసే కొద్దీ చూడా లనిపించి
ఆడే కొద్దీ తనతో ఆడా లనిపించే
తన గురించి ఎంత చెప్పినా తక్కువే మరి...
నిజం చెప్పాలంటే...
తన రాకకై ఎదురు చూడని
వారు ఎవ రుంటారూ...
ప్రాయంతో పనేముంది
అందరికీ ఆహ్లాదం కలిగిస్తూ
తనతో అల్లేసుకుంటుంది...
సూరీడు ఎర్రని కనులనుండి
వేసున్నామీకు అంటూ
చల్లని పిల్ల తెమ్మెర వింజామరాలతో...
మండిన కాయాలకు లేపనాలుగా వీసేస్తూ...
ఆనందాలనే కాక
ఓ మధురపురాని మధురమైన
రోజులనే అందించేస్తుంది...
రైతన్నల పాలిట
కొంగు బంగారమై భాసిల్లుతుంది..
ఇంతకీ ఎవరని అనుకుంటున్నారా...
అదేనండీ....
జీవ కోటికి శక్తి పుష్టి కలిగించేది
నింగిటంచున సప్త వర్ణాలను తిలకింపచేసేది
వాన...

-సి గాయత్రీ దేవి

వాన పడిన వేళ

చిటుకు చిటుకున వచ్చింది వాన
ఉరుములు మెరుపులతో వచ్చింది వాన
చిరు చిరు చినుకులతో పడింది వాన
చిన్నారి పాపాయిలను పరుగెత్తించింది వాన
పడవలు చేసి నీటి కాలువలలో
పోటీలు పెట్టింది వాన
వానా వానా వల్లప్ప అంటూ
ఆటలు ఆడించింది వాన...
వాన జల్లు మందారాన్ని మురిపించి
మిరప మందారం మూతి ముడిపించి
సన్నజాజిని సన్నగా నిమిరి
చంద్ర కాంతను సిగ్గిల్ల చేసి
'డే క్వీన్' (పగలు రాణిని) గుమ్మెత్తించి
'నైట్ క్లీన్'తో (రే రాణి) సరాగా లాడి
కుసుమ కాంతలతో
శ్రీకృష్ణ లీలలు సాగించింది వాన...
'ఉత్తర చూచి ఎత్తర గంప'న్నాడు రైతన్న
ఉత్తుత్తి ఉరుములకు బెంబేలు పడ్డాడు రైతన్న
రైతన్నతో దోబూచులాడింది వానమ్మ
దొంగాట చాలించి వచ్చి ఆనందంతో
ముంచింది రైతన్నను!.

-మన్నే లలిత, హైదరాబాద్

జల ఆనందం

చిరుగాలి ప్రియుడు
మబ్బుకన్నె నడుమును తాకగానే
పులకరింతల జల్లు పుడమిని చేరింది.
చినుకులలో తడుస్తూ
జారుతున్న నిక్కరును పైకి లాక్కుంటూ
ఆనందాబుధిలో దొర్లుతున్నది
వీధిలోని పసితనం...
నాల్గుగు గోడల మధ్య చిక్కుకుని
బయటకు రాలేని రెండు పసి కళ్ళు
బేలగా చూస్తూ నీటిబుగ్గను
రెప్పల వెనుక దాచుకున్నాయి...
మండుతున్న గుండెల మీద పూసే నవనీతాన్ని,
ఆగుతున్న ఊపిరికి ఆయువు పోసే సంజీవనిని,
ప్రకృతి ఇచ్చే వరాన్ని,
పసితనానికి దూరం చేయకండి
వాన ఒడిలో ఆనందాన్ని అనుభవించనీయండి.

-శింగరాజు శ్రీనివాసరావు, ఒంగోలు

ఎడతెరిపిలేని వాన

కుండపోతగా కురుస్తూనే వుంది
లోపలా బయటా సమస్తాన్నీ తడిపేస్తోంది
నాతో పాటు నన్ను నమ్ముకున్నవాళ్లనీ
నిలువెల్లా తడిపి చోద్యం చూస్తోంది...
ఒక దిగులు మబ్బేదో
మెల్లగా కదిలితే చాలు
ఒక విచారపు చల్ల గాలేదో
గుండె ఆకాశాన్ని కొద్దిగా స్పృశిస్తే చాలు
జలజలా జడివానైపోతుంది...
తలుపులూ కిటికీలు మూసేలోపు
గుండె గదులన్నిటినీ ముంచెత్తుతుంది
తెల్లవార్లూ ఇల్లంతా నిండిన దుఃఖాన్ని
ఎత్తిపోయిస్తూ
నిద్రలేని రాత్రుల్ని గడిపించే జాలిలేని వాన
ఇది రాళ్లవానో రాకాసి వానో
పసిగట్టలేని వాన
తడిసి తడిసి బతుకు చివికి చీకిపోయేదాకా
ఈ క్రూరమయిన వాన తగ్గుముఖం పట్టదు...
ఈ వానలో కొందరు అప్పుడప్పుడే తడుస్తారు
ఈ వానలోనే కొందరు బతుకీడ్చుకుంటూ
జీవితాన్నే చాలిస్తారు
దీగులు మబ్బులు ముసిరి
తుపాను గాలులు చెలరేగి
అల్పపీడనాలు సుడిగుండాలు చుట్టుముట్టి
అనుక్షణం బతుకు సముద్రాన్ని
అల్లకల్లోలం చేస్తూ...
ఇది నిత్యం కళ్లల్లోంచి కురిసే
ఎడతెరిపిలేని వాన
ఈ వానను నిలువరించే గొడుగు కోసమే
జీవిత మంతా వెంపర్లాట.

-చిత్తలూరి

రైతన్న కుడిభుజం "దాపటెద్దు"

"దేశానికి వెన్నెముక రైతన్న. రైతు లేనిదే రాజ్యం లేదు. ఆరుకాలం కష్టపడి పంట పండించేవాడు రైతన్న . ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ, చలిలో వణుకుతూ, సస్యములు పండించి ప్రపంచానికి భోజనం పెట్టేది హాలికుడు. భూమిని సాగు చేసే రైతన్నకు నాగలి నడవడంలో ఎద్దులది ముఖ్యపాత్ర. . నాగలి కానకు ఎడమవైపున కట్టేటటువంటి ఎద్దును **"దాపటెద్దు"** గా పిలుస్తారు. నిజంగా చెప్పాలంటే రైతన్న కు ఇది కుడి భుజం. నాగలి నడవడంలో దాపటెద్దు ముఖ్య పాత్ర వహిస్తుంది. నాగలి చక్కగా నడవడానికి ఈ ఎద్దుకు తాడు కట్టి , దాన్ని చేతిలో పట్టుకొని శబ్దం చేస్తూ అదలిస్తు, నాగలి దున్నుతాడు రైతన్న. చాలా తెలివితేటలు కలిగినది దాపటెద్దు. మొక్కజొన్న కర్రలను తొక్కకుండ నాగలి చక్కగా నడవడంలో దీని తెలివితేటలు కనబడతాయి. ఇరువది రెండు చక్కటి కథలతో పుస్తకాన్ని తీర్చిదిద్దారు కవి ,రచయిత బైతి దుర్గయ్య గారు. వృత్తిరీత్యా హిందీ ఉపాధ్యాయుడైన రైతు పడే కష్టం తనకు తెలుసు. తాను ఉపాధ్యాయుడైన కూడా, వ్యవసాయం చేసే కృషివలుడు. అందుకే కాబోలు **"దాపటెద్దు"** శీర్షిక పెట్టారేమో అనిపిస్తుంది."

మొదటి కథ" పసివాడి చదువు"లో చదువుకుంటే జీవితాలు మారిపోతాయని పాలేరుగా ఊడిగం చేయడం కంటే ,బాగా చదివి ఉద్యోగం సంపాదించుకోవాలనే కసితో ఒక పసివాడు ఎదిగిన విధానం రచయిత చక్కగా ఆవిష్కరించారు.

అంతేకాకుండా తన తమ్ముడిని చదివించడానికి పాలేరుగా అక్క వెళ్లడం, మా తమ్ముడు ప్రయోజకుడు అయ్యేంతవరకు తాను పెళ్లి చేసుకోకుండా ఉండడం, తమ్ముడు ఉద్యోగం సంపాదించిన తర్వాత తన ఊరికి వచ్చి తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుని , అక్క కోసం అడగడం పాలేరు గానే అక్క పటేల్ దగ్గర ఇంకా పని జేస్తుందని ,తమ్ముడు గురించి అక్క చేసిన త్యాగం తల్లి వివరించడం, ఈ జీవితం హోదా నువ్వు ఇచ్చిన భిక్క అని తమ్ముడు, అక్క తో అనడం పాఠకులను కన్నీళ్లు పెట్టిస్తుంది.

మానవత్వం మంట గలుస్తున్న నేటి కాలంలో, తప్పిపోయిన ఒక మూగ జీవి గొర్రె పిల్ల కోసం తపన పడే బీరప్ప బాధ "గొర్రె పిల్ల"కథలో తెలుస్తుంది. గొర్రె పిల్ల ఏమైందో నని రెండు రోజులు తిండి తిప్పలు మానేసి , అందరూ కలిసి వెతకడం చివరికి గొర్రె పిల్ల ను చూడగానే బీరప్ప కళ్ళలో ఆనందం కని పిస్తుంది. ఇది శోక రసంలో రాసే ప్రయత్నం చేశారు రచయిత.

హృదయ విధారకరమైన మరో కథ "దాపటెద్దు" . ఇంటికి పెద్ద కొడుకు వలె, రైతన్నకు వ్యవసాయంలో సహాయపడే "రాముడు" అనే దాపటి ఎద్దుతో వారి కుటుంబానికి ఉన్నటువంటి అనుబంధం బాగుంది. రైతన్న తన కుటుంబ సభ్యుడి లాగా రాముడిని చూసుకునేవాడు.

కరువు వచ్చి రైతు వలసకు సిద్ధమైనప్పుడు ముసలోడైన రాముడిని తీసుకోవడానికి ఎవరు ముందు రాలేదు. చివరికి గో ఆశ్రమానికి విరాళం ఇచ్చి, రైతు రాముడిని సాగనంపడం. తర్వాత కుటుంబ సభ్యులందరూ బాధ్యగా ఉండడం చివరికి రైతన్న వలస వెళ్లడం మానేసి ,మళ్ళీ వ్యవసాయం చేయడానికి సిద్ధపడటం తన రామున్ని మళ్ళీ ఇంటికి తీసుకురావడం బాగుంది. మూగ జీవులను రైతన్న ప్రేమించడం, వాటిని దూరం చేసుకుని పరితపించడం, మూగ ప్రేమ కవి చక్కగా వివరించాడు.

"గురువు గారికి ఒక బహుమతి" కథలో ఎంతోమంది విద్యార్థులకు విద్యా దానం చేసిన తమ అభిమాన ఉపాధ్యాయుడైన కోటయ్య గారిని ప్రయోజకులైన విద్యార్థులు ఘనంగా సన్మానించడం, గురువుగారి పేరుతో "కోటి రూపాయల నిధి "ఏర్పాటు చేసి పేద బీద పిల్లలకు ఖర్చు పెట్టమనడం, గురు దక్షిణ గా గురువుగారికి చక్కటి ఇల్లను బహుమతిని ఇవ్వడం, ప్రతి విద్యార్థి గురువు పట్ల కృతజ్ఞత భావాన్ని కలిగి ఉంటార నే సందేశాన్ని రచయిత ఆవిష్కరించారు.

జీవితం అంటేనే సర్దుబాటు సర్దుబాటు లేకపోతే జీవితం ముందుకు సాగదని భార్యాభర్తల మధ్య బంధం దృఢంగా ఉండాలంటే సర్దుబాటు ఉండాలని " సర్దుబాటు"కథలో తెలుస్తుంది. మౌనిక పెట్టిన షరతులకు అంగీకరించి పెళ్లి చేసుకున్న పాపానికి, తిప్పలు పెట్టిన విషయాన్ని పాఠకులకు ఆశ్చర్యం కలిగించేలా మౌనిక పాత్ర ద్వారా నేటి కాలంలో జరుగుతున్న విషయాలను రచయిత చెప్పాడు. చివరికి మౌనికకు , వరుణ్ గుణపాఠం చెప్పాలనుకున్న తీరు బాగుంది.

ఇంకో కథ" చివరి కోరిక" లో ఉరిశిక్ష పడ్డ నాగ రాజు చివరి కోరికగా తన అభిమాన నటుడు నిత్యా రంజన్ ను చూడాలనుకోవడం, తన బావ చేసిన స్వప్న హత్యను తన మీద వేసుకొని జైలుకు వెళ్లడం, తాను ప్రేమించిన అమ్మాయి దృష్టిలో చెడ్డవాడుగా మిగిలిపోవడం, చివరికి రిపోర్టర్ రాకేష్ నాగరాజును కాపాడాలనుకునే ఉద్దేశంతో హత్య మిస్టరీ చేదించడం బాగుంది.

ఆలోచింప జేసే మరో కథ" పాలకొండ బస్సు". కొడుకుల చదువుకు, బిడ్డల పెళ్ళికి అప్పులు చేసి వారిని మంచి స్థాయికి చేర్చాలని కూలి పని చేసి, అప్పుల పాలైతే అప్పులు తీర్చాలని పిల్లలను కోరితే చేతులెత్తేశారు. అందుకే బంగారం లాంటి పొలాన్ని తక్కువ ధరకు అమ్మిన వృద్ధ దంపతులను ఇప్పుడు ఎవరు చేరదీయలేదు. బాధలను ఎవరైనా పంచుకుంటారు బాధ్యతలను మాత్రం కన్నవారే స్వీకరించాలి. అందుకే ఇకనైనా నలుగురు పిల్లల లో మార్పు రావాలని, తల్లిదండ్రులను కంటికి రెప్పలాగా చూసుకోవాలనే చక్కటి సందేశం రచయిత సుతి మెత్తగా చెప్పారు.

నిజం నిలకడ మీద తెలుస్తుంద నే నీతి "ని

క్యాన్సర్‌తో బాధపడుతూ అయాచితం నటేశ్వరశర్మ కన్నుమూత

ప్రముఖ సంస్కృతాంధ్ర పండితుడు, రచయిత, కవి, అవధాన ఘనాపాఠి, విశ్రాంత ఆచార్యుడు అయాచితం నటేశ్వర శర్మ (68) ఇకలేరు. కొంత కాలంగా కాలేయ కేన్సర్‌తో బాధపడుతున్న ఆయన మంగళవారం మధ్యాహ్నం బోయినపల్లిలోని స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయన సతీమణి తిగుళ్ళ అరుణ కుమారి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా పని చేశారు. ఈ దంపతులకు కౌముది, జాహ్నవి యామిని కుమార్తెలు. నటేశ్వర వర్మ స్వస్థలం కామారెడ్డి జిల్లా రామారెడ్డి గ్రామం. ఆయన తండ్రి అనంతరాజ శర్మ... కుమారుడిని సంస్కృత విద్వాంసుడిగా చూడాలన్న ఆశయంతో ఆరో తరగతి పూర్తయ్యాక నటేశ్వర శర్మను తిరుమలలోని సంస్కృత పాఠశాలలో చేర్పించారు. అక్కడ అధ్యయనం సాగిస్తున్న సమయంలోనే అనుష్టుప్ ఛందస్సులో శ్లోకాలు రాసేవారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర ప్రాచ్య కళాశాలలో వ్యాకరణ శాస్త్రాన్ని అభ్యసించి 'వ్యాకరణ శిరో మణి' పట్టా పొందారు. ఉస్మానియా విశ్వవి ద్యాలయంలో సంస్కృ తంలో బీవోఎల్, తెలు గు, సంస్కృతంలె ఎంఏ పూర్తి చేశారు. 'అముక్త మాల్యద కావ్యం'పై ఎంఫిల్, 'శంకర భాగవ త్పాద కృత సౌందర్య లహరి'పై పీహెచ్‌డీ పరిశోదన చేసి బంగారు పతకం అందుకున్నారు. కామారెడ్డిలోని ప్రాకృత విద్యాపరిషత్ ప్రాచ్య కళాశాలలో సంస్కృత అధ్యాపకుడిగా 1977 లో ఉద్యోగ జీవితం ప్రారంభించిన నటేశ్వర శర్మ 2014లో అదే కళాశాల ప్రధాన్యా చార్యుడిగా పదవీ విరమణ పొందారు. తెలుగు, సంస్కృతాల్లో 125కు పైగా అష్టావ ధానాలు, శతావధా నాలు చేశారు. సంస్కృతాంధ్ర భాషల్లో 60కు పైగా పుస్తకాలు రాశారు. వాటిల్లో 'బాల రామాయణం' 'సమయ విలాసిని', 'శకుంతల' 'రుతుగీత', 'సవ్యగీతి', 'భారతీప్రశస్తి' 'అముక్తమాల్యద పరిశీలనలు' 'వసంత కుమారి', 'శ్రీషోడశీ', 'చుక్కలు' తదితర రచనలున్నాయి. ఆయన సాహిత్య సేవను గుర్తించిన తెలంగాణ ప్రభుత్వం 2003లో దాశరథి పురస్కారంతో సత్కరించారు. 'శకుంతల', పద్య కావ్యానికి తెలుగు విశ్వవిద్యా లయం ఉత్తమ కావ్య పురస్కారం, 'భారతీ ప్రశస్తి'కి జాతీయ సాహిత్య పరిషత్తు పురస్కారం లభించాయి. సినారె రచించిన 'రామ ప్ప' సంగీత, నృత్య రూపకాన్ని నటేశ్వర శర్మ సంస్కృతంలోకి అనువ దించారు.

నివాళులు...

అయాచితం వారికి అక్షర నివాళి..
–అవుసుల భానుప్రకాశ్

తెలంగాణ ముద్దుబిడ్డ, సంస్కృతాంధ్ర విద్వత్కవి, శతావధాని, దాశరథి పురస్కార గ్రహిత డా॥ అయాచితం నటేశ్వర శర్మ మృతికి నివాళి...
– డా॥ అమ్మిన శ్రీనివాసరాజు.

శర్మగారి దివ్యాత్మకు నా అశ్రుపూరిత నివాళులు...
– డా॥ ఆచార్య ఫణీంద్ర

మా గురువుగారు అక్షర బ్రహ్మకు అశ్రునివాళి...
–సుమిత్రానంద్ తనోభ

వారి నిష్క్రమణం సాహిత్య ప్రపంచానికి తీరని లోటు...
– సూరారం శంకర్

ఆయన మరణం అత్యంత బాధాకరం...
–దేవేందర్ ఘణపురం

పద్యకవిగా వాసికెక్కిన నిరంతర కృషీవలుడు..
– డా॥సబ్బని లక్ష్మీనారాయణ

అపార జ్ఞాన సంపన్నులు, మహెన్నతమైన వ్యక్తి..ఓం శాంతి..
– ఎన్. నృసింహన్

అయాచితం నటేశ్వరశర్మగారికి ప్రగాఢ నివాళులు..
– గాజుల రవీందర్

అశృతర్పణం చేస్తూ అంజలి ఘటిస్తున్న..
–డా॥ చీదెళ్ళ సీతాలక్ష్మి, పరిమి వెంకట సత్యమూర్తి.

కవిలోకం చిన్నబోయింది
కలమే మూగబోయింది
ఇందూరు కవి దిగ్గజం దివికేగింది
కవిత్వం వాడిపోయింది.
గురువుగారికి శ్రద్ధాంజలి..
– కాసర్ల నరేష్‌రావు

అయాచితం వారికి మనఃపూర్వకమైన శ్రద్ధాంజలి.. తెలుగు సాహిత్యంలో ఆ తరానికి చెందిన వాళ్ళు ఒకరు ఒకరు రాలిపోవడం మనసును కలచి వేస్తోంది..
– కాంచనపల్లి గోవర్ధనరాజు.

ప్రముఖ సంస్కృతాంధ్ర పండితులు, విద్వత్కవి డా॥ నటేశ్వర శర్మగారి అకాల మృతి సాహితీలోకానికి తీరని లోటు...
–దాస్యం సేనాధిపతి

పద్యంలోనే కాక గేయం, వచన కవిత్వంలోనూ నిలిచిపోయే రచనలు చేసిన గొప్ప పండితుడిని కోల్పోయాం శర్మగారి మృతికి కన్నీటి నివాళులు.
– డా॥ వి. శంకర్

60కిపైగా పద్య, వచన కవితా పుస్తకాలు అందించిన గొప్ప పండితులు శర్మగారికి మా నివాళులు...
–వి.పి.చందన్‌రావు

–కందాళై రాఘవాచార్య,గంట్యాడ ప్రసాద్,శారదా హన్మాండ్లు.
సంస్కృత ఆంధ్ర విద్వత్కవి, అష్టావధాని డాక్టర్ అయాచితం నటేశ్వర శర్మగారి ఆత్మకు శాంతి కలగాలని...
–డా॥బి. మల్లేష్.

ప్రఖ్యాత సంస్కృతాంధ్ర పండితుడు రచయిత, కవి అవధాన ఘనాపాఠి ఆచార్య అయాచితం నటేశ్వర శర్మగారికి అశ్రునివాళులు..
– సిరిసిల్లా గఫూర్ శిక్షక్, మోత్కూరి నరహరి, రమణాచారి

అయాచితం వారి జీవన రేఖలు

సంస్కృతాంధ్ర భాషల్లో 60కిపైగా రచనలు

సంస్కృతాంధ్ర విద్వత్కవి, అష్టావధాని డాక్టర్ అయాచితం నటేశ్వరశర్మ 17 జూలై 1956లో కామారెడ్డి జిల్లాలోని రామారెడ్డి గ్రామంలో జన్మించారు. 1969లో సంస్కృత విద్యాభ్యాసం చేస్తున్న రోజుల్లోనే సంస్కృతం, తెలుగులో పద్య, గేయ రచ నలు చేయడం ప్రారంభించారు. 1970లో కంచి కామకోటి పీఠాధిపతి జయేంద్ర సరస్వతి స్వామి తిరుమల శ్రీ వేంకటేశ్వర వేద సంస్కృత పాఠశాలను సందర్శించిన సమయంలో విద్యార్థిగా ఉన్న శర్మ సంస్కృత శ్లోకాలతో స్వాగతం పలకడంతో ఆయన ఆశ్చర్యపోయారు. అభినందించి మంచి కవిగా పేరు తెచ్చుకుంటావని ఆశీర్వదించారు. తర్వాత శర్మ తన పాండిత్య ప్రతిభతో అంచెలంచెలుగా ఎదిగారు. సంస్కృతం, తెలుగు భాషల్లో 50కిపైగా రచనలు ప్రచురితమయ్యాయి. వచన, గేయ, పద్యసంకలనా లు, శతకాలు, ఖండకావ్యాలు, విమర్శలు ఉన్నాయి.

ఓయూలో ప్రాచ్యభాషా పీఠాధిపతిగా సేవలు

కామారెడ్డిలోని ప్రాచ్యవిద్యాపరిషత్తు ప్రాచ్య కళాశాలలో 1977 నుంచి సంస్కృత విభాగాచార్యులుగా, అనంతరం ప్రధానాచార్యులుగా పనిచేసి 2014జూలైలో నటేశ్వరశర్మ పదవీ విరమణ చేశారు. 2011నుంచి 2013వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ప్రాచ్యభాషా విభాగానికి పీఠాధిపతి(డీన్)గా సేవలు అందించారు. ఆయన సాహిత్య వ్యాసాలు, కవితలు, విమర్శలు వివిధ పత్రికల్లో ప్రచురితమ య్యాయి.

అంతర్యామి శీర్షికతో చేసిన రచనలు పాఠకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇటీవల ఆయన సంస్కృత సంగీత రూపకం 'నాగిని' పేరుతో హైదరాబాద్ ఆకాశవాణిలో ప్రసారమై రామప్ప దేవాలయ శిల్పకళా వైభవాన్ని చాటింది. విద్యార్థి దశలో రాసిన వచన కవితా సంపుటి 'విక్రాంతిగీతి' దాశరథి ప్రశంసలు అందుకుంది. అవధాని శశాంక, శతావధాని సమ్మన్నగారి లక్ష్మీనరసింహ శర్మ అవధానాలతో స్ఫూర్తి పొందిన శర్మ డాక్టర్ రంగనాథ వాచస్పతితో కలిసి జంట అవధానాలు చేశారు. నటేశ్వరశర్మ తొలి గేయసంపుటి 'వసంత కుమారి'(1981). ఖండకావ్యాల లో సమయవిలాసిని, పంచశరీయం, సౌదామినీ విలాసం, చుక్కలు, చైత్రరథం, ఆటవెలది, జీవనయానం విశిష్ట రచనలుగా పేరుకెక్కాయి. వ్యావహారికభాషలో రాసిన 'కవితాశతకం'.. శ్రీశ్రీ రచన 'సిరిసిరిమువ్వ' శతకాన్ని తలపిస్తుంది. ఆయన విశిష్ట సాహిత్య సేవలను గుర్తించిన 'భక్తిసాధనమ్' ఆధ్యాత్మిక సంస్థ గజారోహణ పురస్కారంతో సత్కరించింది.

జులై 22 2023న దాశరథి పురస్కారం అందుకుంటూ...

వందకుపైగా అష్టావధానాలు

నటేశ్వరశర్మ రచించిన అభిజ్ఞాన శాకుంతలానికి పద్యానువాద ప్రబంధం 'శకుంతల'కు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ కావ్యపురస్కారం లభించింది. దేశభక్తి కవితా సంపుటి 'భారతీ ప్రశస్తి'కి జాతీయ సాహిత్య పరిషత్తు పురస్కారం అందుకున్నారు. రుతువుల సోయగాలను వర్ణిస్తూ రచించిన 'రుతుగీత'కు ఉత్తమ కావ్యపురస్కారం వరించింది. తెలంగాణ రాష్ట్ర వైభవాన్ని ప్రస్తుతిస్తూ సంస్కృతంలో రాసిన 'తెలంగాణ సుప్రభాతం'.. 'తెలంగాణ' మాసపత్రికలో ధారావాహికంగా ప్రచురితమై పాఠకులను ఆకట్టుకున్నది. రాష్ట్రావిర్భావం తర్వాత 33 జిల్లాల ప్రత్యేకతలను తెలుపుతూ రాసిన పద్యాలు ఈ నేల విశిష్టతను చాటాయి. సంస్కృతాంధ్ర భాషల్లో శర్మ నూటికిపైగా అష్టావధానాలు చేశారు. అవధాన ప్రతిభకు తెలుగు విశ్వవిద్యాలయ ప్రతిభా పురస్కారం ల భించింది. ఆదిశంకరాచార్యులు రచించిన 'సౌందర్యలహరి'పై పరిశోధనలకుగాను 1994లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా, స్వర్ణపతకం అందుకున్నారు. ఆముక్తమాల్యదపై ఆయన విమర్శనా గ్రంథం ప్రామాణికమైంది.

సత్కారాలు.. పురస్కారాలు

రంజని–విశ్వనాథ పద్యకవితా పురస్కారం(2009), కిన్నెర ఆర్ట్ థియేటర్ వారి వచన కవితా పురస్కారం(2010), కిన్నెర–కుందుర్తి వచన కవితా పురస్కారం(2011), రాష్ట్రకవి జెగేటి ధార్మిక సాహితీ పురస్కారం(2012), తెలుగు విశ్వవిద్యాలయం నుంచి అవధాన కీర్తిపురస్కారం(2012), సర్వవైదిక సంస్థానం విశిష్టకవి పురస్కారం(2013), తెలంగాణ పద్య సాహిత్య పురస్కారం(2013), శాతవాహన విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ పద్యకవి పురస్కారం(2014), తేజ ఆర్ట్ క్రియేషన్స్ నుంచి విశిష్టకవి పురస్కారం (2014), విశ్వసాహితి విశిష్ట సాహిత్య పురస్కారం(2014), భక్తి టీవీవారి ఆధ్యాత్మిక సేవా పురస్కారం(2014), తెలుగు విశ్వవిద్యాలయం నుంచి అవధాన ప్రతిభా పురస్కారం(2015), ఇందూరు అపురూప సాహితీ పురస్కారం(2016), వర్గల్ సరస్వతీ క్షేత్రం వారి 'అవధాన భారతి' పురస్కారం(2020), మల్లినాథసూరి కళాపీఠం వారి 'మహోపాధ్యాయ' పురస్కారం (2021), డీవీఎల్ఎన్ శాస్త్రి స్మారక సాహితీ పురస్కారం(2021), కోటంరాజు స్మారక సాహితీ పురస్కారం(2021) వంటి పురస్కారాలు ఎన్నింటినో నటేశ్వరశర్మ అందుకున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గత సంవత్సరం ప్రతిష్టాత్మక దాశరథి పురస్కారంతో అయాక్స్ నటి శ్రీ శర్మ గారిని ఘనంగా సన్మానించింది.అయాచితం వారి నిర్యాణం తెలంగాణ సాహితీ లోకానికి తీరని లోటు... ఆ మహానుభావుడికి దర్శనమ్ శ్రద్ధాంజలి ఘటిస్తోంది. ఇటీవలే వారి పరిశోధన రచన సౌందర్యలహరి సౌందర్యం గొప్ప కావ్యాన్ని దర్శనమ్ ప్రముఖుల సమక్షంలో ఆవిష్కరణ ఉత్సవం జరుపుకుంది.

–వి.శేషారావు
9440408080

మాటబ్గ సిరులమాటబ

మాటబ
సిరుల మాటతే
వాటిని వృధాగా పోనీయకు
మాటలలో చెడును రానీయకు
మాట ప్రాణం
మాట ధ్యానం
ఒక్క నిమిషమైనా
అసత్యం కానీయకు
మౌనపంజరంలో
మాట సురక్షితం
పంజరాన్ని దాటనీయకు
మాటలోని అమృతాన్ని ఆస్వాదించు
మాటలోని ఆనందాన్ని అనుభవించు!

మరువకూడని జాబిల్లి !

నా బాల్యంలోని రాత్రులను
వెన్నెలతో నింపిన జాబిల్లి
కంటిలో!
పుస్తకనదీతీరమాన్ని
స్వీయకిరణాలతో వికసింపజేసిన
తరుణబింబం కంటిలో!
కొట్లా దప్పులా, కంటకాలా సర్పాలా
దారిలో బాధించకుండా
అండగా నిలిచిన కరుణామృత
కంటిలో!
ధగధగలాడే నేటి విద్యుద్దీపాలమందు
వెలవెలబోతున్న నన్
కంటిలో నాకు అపురూపవస్తువు!
దాని పెటగుదారిలో ప్రయాణించి
ఇంతదాకా మందుకు సాగిన నేను
ఆ కంటిలిని ఎలా మరచిపోతాను ?

డా॥అయాచితం నటేశ్వరశర్మ

కనుమరుగైన రాతబ

'ఉభయకుశలోపరి' లేదు.
ఉత్తరం ఎక్కడా కనడదు.
చేతిరాత పాతబడినట్లేనా?
రాతలోని సొబగులకు
పాతరు వేసినట్లేనా?
కడలని అక్షరాలకంటె
కదిలే జొమ్ములకేనా ఆదరణ?
కన్నులను మాయం చేసే
గతులవెంట పరుగులెందుకు?
పలకరింపుల కలలోనేనా?
చిరునవ్వుల చిలకరింపుల
కరవాణులలోనేనా?
ఏదిరా నాటి ఆత్మీయత?
గతవైభవమేనా?
గాలిలో కలసినట్లేనా?

డా॥అయాచితం నటేశ్వరశర్మ

తలం!
జలం!
ప్రకృతి ప్రకోపిస్తే..ఏకధాటి వర్షంతో
అతలాకుతలం!!
–జీ యన్ వీ సత్యనారాయణ
హైదరాబాద్

ప్రకోపము
ప్రతాపము
మనిషికి వరమైన ప్రకృతే– కోపిస్తే శాపము
–డా.పి.వి.రామ కుమార్
హైదరాబాద్

క్షణం
తక్షణం
రెప్పపాటు కాలంలో వినాశనమే ప్రమాదాల లక్షణం!
–మొర్రి గోపి, కవిటి

మరువం
గరువం
ఘుమాయింపు జ్ఞాపకాల దొంతరలు మన పరువం.
–క్రొవ్విడి వెంకట బలరామమూర్తి, హైదరాబాద్.

తెలిపోకు
రాలిపోకు!!
పంచభూతాలతో స్నేహమే శ్రేయస్కరమని ఎప్పటికీ మర్చిపోకు!!!
–ఎమ్మెస్సార్ షణ్ముఖ ప్రియ
విజయవాడ

పదం
జానపదం
నాగరికత వ్యామోహంలో మరువకు కమ్మనైన పల్లెపదం
–గంగరాజు పద్మజ

నాణ్యత
ప్రావీణ్యత
కవులు కవయిత్రులు సాధించాలి సప్తపదులలో గణ్యత
–కాటేగారు పాండురంగ విఠల్

తుంచు
పెంచు
ఆనందం కావాలంటే దేనినైనా
అదుపులో ఉంచు
–కాయల నాగేంద్ర,
హైదరాబాద్

గొడుగు
మడుగు
వర్షంలో నడిచేటప్పుడు జాగ్రత్తగా వేయాలి అడుగు.
–డాక్టర్. షహనాజ్ బతుల్
హైదరాబాద్

గెలుపు
పిలుపు
ఒకసారి ప్రయత్నిస్తే జీవితం తిరుగుతుంది మలుపు
–కుసుమ పత్రి
తణుకు

కడవ
పడవ
ఎడతెగని వానలకు అవసరం ఇంటాబయటా ఈతడవ
–అర్చన కోపూరు
హైదరాబాద్

వినరాదు
చెప్పరాదు
ఆలోచనలో కూడా ఎవరికీ చెడు చేయరాదు
–ఆర్. రమాదేవి, హైదరాబాద్

సహజీవనం
సమజీవనం
సలుగురితో కలసి జీవించినపుడే అవుతుంది సంఘజీవనం!
–పట్నాయకుని రామకృష్ణారావు

కవిత్వం
తన్మయత్వం .
తాదాత్మ్యం కలిగించి అలరించే అదియే –భావకవిత్వం**–బుర్రి కుమార్ రాజు**, శ్రీకాకుళం

ఏరు!
నీరు!!
మానవదోషాలే ముంపునకు సాక్ష్యం అయింది బుడమేరు !!!
–ఎమ్మెస్సార్ భార్గవి ప్రియ
విజయవాడ

సాన్నిహిత్యం,
ఐకమత్యం,
మానవీయమైన విలువలను మనుష్యులలో నిలిపేది సాహిత్యం!
–దినవహి సత్యవతి, గుంటూరు.

గతి
మతి
సజ్జనసాంగత్యం వల్ల కలుగును మనుష్యులకు. సద్గతి!
–డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచార్య
మహబూబ్ నగర్

ఆరాటం
ఆర్భాటం
జననమరణాలు రెప్పపాటు – మధ్యన ఆటుపోటుల పోరాటం..
–పి.బాలా త్రిపుర సుందరి, హైదరాబాద్

అనుమానం
అభిమానం
ఎక్కువైతే కలుగుతుంది మనసుకి అంతులేని స్వాభిమానం!
–పప్పు సుజాతారావు,వైజాగ్

అవేదన..!
నివేదన...!!
మనసైన వారికి అర్పించేది అంతరంగనీలోని ఆరాధన....!!!
–మహమ్మద్ అంకూస్, బెల్లంపల్లి

అభివృద్ధి
సమృద్ధి
మానవాళి నిండైన జ్ఞానఖనితో చెందాలి వృద్ధి.
–జంగిటి ఉమా విష్ణు
సిద్దిపేట. జిల్లా. సిద్దిపేట.

ముందుగు
వెనకడుగు
నిర్ణయాలలో శపభిషలు ఎందుకని మనసుని అడుగు
–ఆచార్య వై వి సుబ్రహ్మణ్యం,
హైదరాబాద్

పాపాలు !
శాపాలు !!
మంచి–చెడు మధ్యన మనిషికి తప్పనిసరిగా ఆపసోపాలు!!!
–నేమాన సుభాష్ చంద్ర బోస్
విశాఖపట్నం

కలలు
వలలు
సంసారం సాగరం .ఆగవు కోరికల అలలు!
–జంజం కోదండ రామయ్య

శృతులు
కృతులు
రాగభరితం –సమ్మేళనంతో కొందరు పొందుతారు జీవనభృతులు
–ద్విభాష్యం నాగలక్ష్మి

ఆరదు
మారదు
శబ్దబ్రహ్మోపాసన ఎంతకాలం చేసినా తనివి తీరదు
–సూర్యదేవర రవికుమార్
గుంటూరు

భజించు
భుజించు
సదా సంతృప్తితో జీవించు విచారము పరిత్యజించు
–సింగితం విజయలక్ష్మి
చెన్నై

రీతి,
ఖ్యాతి,
కుటుంబానికి పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టేది నాతి
–మేము విజయ్ కుమార్
మనుబోలు నెల్లూరు

కర్మము
మర్మము
కాయంలో జీవం ఉన్నన్నాళ్ళు పాటించాలి స్వధర్మము
–కామేశ్వరి వాడ్రేవు
రాజమహేంద్రవరం

మాయం!
కాయం!!
చావు పుట్టుకలకు మధ్య చిన్న అంతరాయం!!!
–మన్నవ నాగ లలిత శ్రీదేవి
విజయవాడ

జననం
ఖననం
నలుగురికి మంచి చేస్తే చేసుకుంటారు మననం..
–పంతుల లలిత–నీలాంజన
విశాఖపట్నం

సంసిద్ధత
సన్నద్ధత
తిరుగులేని విజయానికి ఉండాలి ప్రణాళిక నిబద్ధత.
–పట్నాల ఈశ్వరరావు
విజయనగరం

కరణం
కారణం
పరిష్కారం అందుబాటులో ఉన్నప్పుడు ఎందుకు రణం
–ఆలేటి పరంజ్యోతి , ఖమ్మం

ముళ్ళు
కుళ్లు
ఆడబిడ్డని ఛిద్రనీచేస్తూ నిర్దాక్షిణ్యనీగా చంపే మృగాళ్లు
–బలివాడ హరిబాబు
విశాఖపట్నం

సఫలం
విఫలం
మూర్ఖులను ఒప్పించటానికి చేసే ప్రయత్నాలు నిష్ఫలం!
–గోపరాజు వెంకట సూర్యనారాయణ
హైదరాబాద్.

ఒంటరిగానైనా

న్యాయాన్ని కప్పుకున్న
మేక తోలు మాటలు
మంత్రముగ్ధమై మనసు దోస్తాయి
నిజం
నిష్ప్రయోజనమై
దిడ్డిదారి పడుతుంది
సామాజిక న్యాయం నేతిబీరకాయ
భ్రమలు కలిగిస్తుంది.
తెర ముందర ప్రజాస్వామ్యం
ప్రాణం లేని బొమ్మ లాట
తెర వెనక ధనస్వామ్యం
తన్నుకపోయే చెలగాటం.
ఎవరు నల్లా అనరు
ఎవరు తెల్లా అనరు
ఎవరికి ఎవరు ఏమవుతారన్నట్టు
తెల్లవారు తేదీ మార్చుకొని
దిగులు పడుతుంది.
అనాదిగా వస్తున్న
పునాదులు కూలిపోయి
మనుషుల మధ్య చిత్రమైన గోడలు
కట్టుకుంటాయి
నమ్మకాన్ని ద్రోహం చేస్తూ
ఒకే గడియారం రెండు ముఖాలు
వేరువేరు కాలాలను తలపింప చేస్తుంది
మాటల వెనుక దాగిన చీకటి
ముఖం కనిపించనీయదు.
దశాబ్దాలుగా మనం
తప్పుడు గమ్యం వైపు నడుస్తున్నాం
ఇంత దూరం నడిచాక
జతికిన దగ్గర
జాగ్రత్త పడితే సరిపోదు
ఒంటరిగానైనా
ఒక కొత్త దారి నిర్మించుకోవాలి
–బెల్లంకొండ సంపత్ కుమార్
99085 19151.

రుబాయీలు

అరటిఆకులు ఆలింగనము చేయ
మండపము బాగుంది
ఆడపడుచులు అట్టహాసము చేయ మండలము బాగుంది
పెళ్లినాటి సంబరాలే జీవితకాలపు జ్ఞాపకాలు
సొగసరి నవవధువును ఆహ్వానించ మండనము బాగుంది.

స్వార్థం చాచిన కోరలకు నలిగిన మనుజుడే అంతట
మానవతల సమాధులపై సుఖపడు దనుజుడే అంతట
సంబంధాలను కసిగా రూపాయి చిలుకుతూ ఉంటే
ఉద్భవించు విషాన్ని చూస్తున్నాడా అజుడే అంతట.

క్షణక్షణము నిన్నే తలచేటి ఉన్మాదిని చూసావా
నీ ఊసులతో లయం చేసిన సమాధిని చూసావా
నా స్వార్థం, పరమార్థం నీ నీడన వెలుగొందడమే
మరు లోకాన్నినిర్మించే పరమావధిని చూసావా.

వజ్ర వైడూర్యాలెందులకు – నా మౌక్తికము నువ్వు
అష్ట ఐశ్వర్యాలెందులకు – నా కౌతుకము నువ్వు
నీ ఉనికిలేని ఇల నాకు వేరేగ ఉంటుందా
ఎద నీకర్పించాక ఆపాదమస్తకం నువ్వు
–రెడ్డిశెట్టి పవన్ కుమార్

తడుపుతుంటా..!!

నేనిప్పుడు
తేమ ఇగిరిపోయేలా
పదాలను ఆరబోసుకోవాలట !
అక్షరాల గుండా
ఆర్తి పొంగి పొర్లి
తడి తడిగా తగిలి
కలవరపెడుతోందట !.
గుండెను చీలుస్తూ
ఒక్కో చురకత్తి
లోతుగా దిగబడుతూ
పదను ఆరడం లేదు
కంటికి ఎదురుగానూ
కలల్లోనూ రక్తాశ్రువులు
రాలుతూనే ఉన్నాయి.
కాలాన్ని తవ్వుకుంటూ
నలుదిక్కులా కళ్ళను పరిచి
వెతుకుతూనే ఉన్నా
అందినంత మేర
చూస్తూనే ఉన్నా..!
సముద్రమంత దుఃఖం
ప్రవహిస్తోంది అంతటా.
అనంత శూన్యంలో
చిక్కుకున్న భావాలు
మది గదిలో పేరుకొని
బంధనాలు బిగిస్తున్నాయి
అందుకే....
నా కలం ఆర్ద్రతగా
ఎద వాకిళ్ళను
తడుపుతూనే ఉంటుంది
–అరుణ ధూళిపాళ

రెక్కలు

గెలిచిన రోజు
నెత్తినెత్తుకుంటారు
గెలవని రోజు
నెలకేసి కొడతారు

పునరావృతాలు
ఓటమి విజయాలు
–పి. శ్రీనివాస్ గౌడ్

నానీలు

నిచ్చల జ్ఞాన వృక్షం
గురువు
ఫలాల ఫలితం
విశ్వవ్యాపితం

ఉన్న స్థితిలో
జ్ఞాన ప్రసారం
అనంత స్థితులుగా
నిరంతర ప్రవాహం

కాలమా!
ఏమిటీ పరీక్ష?
శిష్యుల కోసం
గురువుల పరుగులు

ఆది గురువు
ఆధునిక గురువు
యుగాలు మారినా
జ్ఞాన తృష్ణ తీరలే

మొట్టికాయేసే గురువు
అంతరాత్మ
అందుకే నచ్చదు
తప్పుకు తిరుగుతాం

జ్ఞానం వైపు గమనమే
గీత బోధ
మరి కన్నయ్య
జగద్గురువేగా!
–ఉ. సులోచన

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం–కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్ని కవితలను నేటినిజం పాఠకుల కోసం..

నిర్వహణ
–కందుకూరి శ్రీరాములు
,–బెల్లంకొండ సంపత్ కుమార్
–సంపాదకులు

వెన్నముద్ద

అకాశములో ఉండాల్సిన
చంద్రబింబం
చేతులోకి వచ్చిందేమిటి ?.
మనసు వారిస్తుంది
నోరు ఊరిస్తుంది.
వెన్నెల నుండి
వెన్న వచ్చిందో
వెన్న నుండి
వెన్నెల వచ్చిందో కానీ –
రెండు అందమైనవే
అందగత్తెలు ఆరాధించినవే !

వెన్న ముద్ద కరగకుండా
వెన్నెల వెళ్లిపోకుండా
చేయటం ఎవరి తరం ?
జీవితంలోనూ
ఏవైనా వేటికైనా
ఉన్నప్పుడే వాటి విలువ
ఓ మనిషీ
నువ్వూ అంతే
బతికి ఉన్నప్పుడే!.
–కందుకూరి శ్రీరాములు

ముత్యాల మూట

ఊటల..ఊటల తెలుగు మాటరా ఇది !
తేటల తేటల తెలుగు పాటరా ! ఇది !
పేటపేటలా బావుటా ఎగుర వేసెరా ! ఇది !
మాటలన్నీ మల్లెల పరిమళింపు తోటరా! ఇది !
వేష–భూషలు వేరైనా – ఎన్ని యాసలైనా
ఏ చోటునైనా తానొకటిగ నడయాడి– మెచ్చు భాషరా !
తెలుగు భాషను చాటగా– చకచకా సయ్యాటలాడురా!
ఎన్ని ఎన్నిన్నో ప్రక్రియలలో మాటిమాటికి వినసొంపైన
కవనంపు మూటరా ! ఇది !
విమర్శల చాటలో వేసి చెరిగినా–
పొల్లు లేని గట్టి తెలుగు భాషరా !చేటు అసలే లేదురా!
కోటల రాచరికము నిలబెట్టు సాటిలేని సేధాన కర్తరా !
ఘనతకెక్కిన మైత్రీబంధపు మైపూతరా !
అత్యధిక జనుల నోట పలుకు ముత్యాల మూటరా !
స్వర్ణయుగాలనెన్నో సృష్టించిన తెలుగు కైతల జాతరా
ఏనాటికీ సమసిపోనీ బహుచక్కని భావాల పేటిరా !
వన్నెచిన్నెలెన్నడూ తరగని అక్షరాలున్న భరిణెరా ఇది
వాడుక కొద్దీ ఊరు తేనెల సోనల ఊటరా ఇది !
ఎన్ని భాషలనైనా తనలో కలుపుకొని వెలుగు
ఒద్దికైన అమ్మ తనపు మంచి తనమనే మాగాణమురా!!
కలివిడి భాషలతో కమ్మని రచనల సేద్యమురా!!
–రంగరాజు పద్మజ

నానీలు

నిచ్చల జ్ఞాన వృక్షం
గురువు
ఫలాల ఫలితం
విశ్వవ్యాపితం

ఉన్న స్థితిలో
జ్ఞాన ప్రసారం
అనంత స్థితులుగా
నిరంతర ప్రవాహం

కాలమా!
ఏమిటీ పరీక్ష?
శిష్యుల కోసం
గురువుల పరుగులు

ఆది గురువు
ఆధునిక గురువు
యుగాలు మారినా
జ్ఞాన తృష్ణ తీరలే

మొట్టికాయేసే గురువు
అంతరాత్మ
అందుకే నచ్చదు
తప్పుకు తిరుగుతాం

జ్ఞానం వైపు గమనమే
గీత బోధ
మరి కన్నయ్య
జగద్గురువేగా!
–ఉ. సులోచన

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1246వ రోజు **"అనుభవం గొప్ప గురువు"** అనే అంశంపై పలుపురుకవులు తమ కవితలను పంచుకున్నారు. **"అనుభవం గొప్ప గురువు"** అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...

-సంపాదకులు..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ నవ బృహం
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
-డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు,
9441046839

జీవన సారం

పంచ అధ్యాయాలతో
సాగే విధి విధానం
జీవన గ్రంథం
ఓ చక్కని అనుభవ సారం
ప్రతీ పుట ఆసక్తి దాయకం!!.
ఓ చిన్న అణువు
అమ్మ గర్భంలో చేరి
దినదిన ప్రవర్ధమానమై
ముడుచుకున్న కాళ్ళుచేతులు
ఉమ్మ నీటిలో జలకాలాడుతూ
గాలి ఎటో తిండి ఎట్లనో
చీకటి కుహరంలోనే
పది నెలల ఆవాసం
పదిలంగా కాచే తల్లి
మొదటి అధ్యాయం ముగింపు!.
తల్లి గర్భ దేవాలయం నుండి
బయటకు వచ్చిన క్షణం నుండి
భాష రాక మాట లేక
ఆకలికి బాధకు ఏడ్పు భావనే
ఆట పాట ఆనందం
ఏమెరుగని అమాయకత్వం
రంగులలోకంలో రాగరంజితం
శైశవ అధ్యాయం తిరిగిరాని
సంతోష భావజాలం!!
విద్య వికాసం సంస్కారం
లోకజ్ఞానం, మంచి చెడు
కష్టాలు, కన్నీళ్లు, సంబరాలు
ఆట పాట స్నేహితులు
ఎన్నో ఎన్నో అనుభూతులు
ఎన్నో కథలు నీతులు
బాల్యం భోగ జీవనం
గురువుల పెద్దలు చెప్పిన బాట
జీవితానికి సుద్దుల మూట!!.
యవ్వనం నేర్పే జీవిత పాఠాలు
అనుభవ సారం
వయసే ఎగిరే విహంగం
ఊహల రెక్కలతో విశ్వ దర్శనం
సుఖ దుఃఖాలు ఈసడింపులు
అవహేళనలు కోపతాపాలు
ప్రేమలు, పెళ్లిళ్లు, బాధ్యతలు
ఉద్యోగాలు, పిల్లలు,స్నేహితులు
సమస్త అనుభవ సారం
ప్రతీ పుట నవరస భరతం
అది జీవన భారతం!!
వృద్ధాప్యం కొందరికి వరం
ముసలితనం కొందరికి శాపం
మూటకట్టిన అనుభవం
సంసార సాగరం
అనుభవైకవేద్యం
సుఖదుఃఖాలసారం
రాసుకున్న బతుకు పుస్తకం
ప్రతీ పుట తెలిపే అంతరంగం
వడబోసిన జీవితం
మనుమలతో
ఆనందమయ
జీవిత పుస్తకం సుఖాంతం!!.

-డా. చీదెళ్ల సీతాలక్ష్మి

జ్ఞాన దీపిక

విజ్ఞానంతో చేసే కార్యక్రమం
చేరుతుంది ఎత్తులను
విజయాలే పొందుతుంది
అజ్ఞానంతో చేసే కార్యక్రమం
అపహాస్యాల పాలు.
తల పండిన వారి మాట
తరతరాలు
తప్పు ఆలోచనలతో
తెచ్చుకోకు ముప్పు ముంగిటకు
ముచ్చటైన అనుభవాలు
జీవితానికి గుణ పాఠాలు
విజ్ఞాన బాటలు
విలువైన మాటలు
శాశ్వతం కడవరకు.
అనుభవం ఒక విజ్ఞాన శాస్త్రం
ప్రతిక్షణం తనకు తాను పరిశోధన
అనుభవం రంగరించి వడబోసి
లక్షణమైన ఫలితాలు
అందించు జనావళికి
పెద్దలని గౌరవించి
వారి సలహాలు పాటించడం
విజయానికి నాంది.
గురువు శిష్యులకు
విద్య, అనుభవాలు, జ్ఞానం
అనుక్షణం అందించు
పరమాత్ములా.
కాలగతి, జీవన పోరాటం
సత్యాన్వేషణ
నిరంతర పరిశోధన
నీట పడ్డ వాడికి ఈత
అవసరం
ఊపిరి అందని వారికి
గాలి అవసరం
అందుకే అవసరం అనుభవం
నడిపిస్తాయి సత్యాన్వేషణకై.
కడవరకు
పెద్దల మాట చద్ది మూట
అనుభవాల బాటలో
అచ్చు తెలుగు పాటలా
అందిస్తారు బంగారు పలుకులు!!.

-కె.కె.తాయారు

వృద్ధాప్యం

జీవనం బుద్బుదప్రాయం
ఉన్నంతవరకు పయనం
పసిపయసు ఆరాటం
పడిలేచే హృదయతరంగం
బాల్యం ఒక అనుభవం
బతుకు తెరువులకు ప్రారంభం
యవ్వనం బాధ్యతల పోరాటం
సుఖజీవనయానంలో గందరగోళం
నడివయసులో నడిపే నావ పయనం
ఆటుపోట్లు తట్టుకొని చేరే తీరం
వృద్ధాప్యంలో గురువావతారం
అనుభవాలు రంగరించిన వైనం
రాబోవుతరాల గుణపాఠం
తెలియని పసి వయసు
తెలిసీ తెలియని బాల్యం
అన్నీతెలిసిన యవ్వనం
అనుభవసారమే వృద్ధాప్యం
ఆచారాల నుండి
ఆయుర్వేదం వరకు
అనుభవాల నుండి
ఆనందాల జీవనం కొరకు
జీవితానికి కావాలి
జీవనంలో సలహాలకి
అనుభవాల గొప్ప గురువు
వృద్ధాప్యమే !!.

-గుండవరం కొండల్ రావు

జాతి సంపదలు

అగౌరవానికి, నిరాదరణకు
గురవుతున్న జాతి సంపదలు
రేపటి తరపు తరువుకు ఎరువుగా
మారే అనుభవజ్ఞాన పండుటాకులు!.
సంతానం సంతృప్తిగా తిని
గిరాటేసే ఎంగిలాకులు
అవసరం తీరాక అవతల
పారవేసే నిచ్చెనలు!.
జీవితాంతం చాకిరీతో
అలసిసొలసే సాధుజీవులు
అనాయాస మరణం రావాలని
కోరుకునే నిస్సహాయులు!.
తమ పిల్లల తప్పిదాలను మరచే
అల్జీమర్స్ బాధితులు!!.

-చంద్రకళ దీకొండ

ముదిమి

ఆశలుడిగితె ఆనందమెక్కడ
రెక్కలు రెపరెపలాడితే
ఎగిరే జయపతాక
మిగిలిపోయిన
శేషజీవితం కాదది
జీవన సాక్షాత్కారమయ్యే
విశేషణమది
బంధాలు అనుబంధాల విలుప్తమా
కుటుంబ విలువల మానవీయకోణమా
ముదిమిలోనే
ముదమున్నదని తెలిసేదెవ్వరికి.
అనుభవాలు నేర్పిన
జీవితపాఠాలెన్నెన్నో
ఆర్థిక బంధాలే
అర్థవంతమౌతున్నవైనం
హార్దిక బంధాలను
విస్మరిస్తున్న రోజులుగా
కేంద్రక కుటుంబ వ్యవస్థలో
ముదిమిలోని పెద్దలెందుకని
వృధ్యాప్యంలో
ఎవరికి ఎవరూ ఏమీకారని
ముసలితనంలో
ఒంటరితనపు బాధ ఎంతో
తోడు నీడ లేకుండా
మోడువారిన జీవితాలెన్నో
ఉమ్మడి కుటుంబంలో
ఆత్మీయతానురాగాలు
ఉమ్మడి కుటుంబాల విచ్ఛిత్తి
వ్యక్తిగత స్వేచ్ఛ పేరున
చిన్నతనంలో
చిన్నారులు వసతిగృహాల్లో
ముసలితనంలో
పెద్దలు వృద్ధాశ్రమాలలో.
మారింది నవనాగరికత
ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో
పైకముంటేనే అభినయ విన్యాసం
పైకం లేకుంటే అనాథ ప్రేతాత్మల్లా
వ్యక్తి ఉన్నప్పుడు లేని భక్తిప్రపత్తులు
వ్యక్తి మరణానంతరం అభివ్యక్తీకరణం.

- లక్ష్మారెడ్డి పసుల

తరాల అనుభవం

తరాల
అనుభవ గాథల వృద్ధాప్యం
తల పండిన అనుభవాల
అనుబంధం
ఎన్నో ఎన్నెన్నో
బాధలకోర్చిన హృదయం
పరివారంతో పెనవేసిన బంధం
కుటుంబమంతా నాదేనంటూ
నావారేనంటూ
జీవితమంతా బాధ్యతలతో
అలుపెరుగని పోరాటం.
తీరని ఆశలు
రెక్కలు చాస్తున్నా
పిల్లల భవితకు
రేయనక పగలనక
బండెడు చాకిరీకి
జీవితం అంకితం.
తనవారేనంటూ సంబర పడుతూ
వారి భవితకై
కష్టాలను, కన్నీళ్ళను భరిస్తూ
సుఖదుఃఖాల నన్నింటిని
మరిచి
కుటుంబమే నా లోకం అంటూ
కడదాకా జీవిస్తారు.
బిడ్డలను
తోడూ నీడగా భావిస్తూ
అనుభవాల మూటగా
ఆత్మవిశ్వాసంతో జీవిస్తున్నా
మాటల విరుపులతో
వృద్ధాశ్రమాలకు నెట్టేస్తారు
మొదలవుతుంది జీవన పోరాటం
ఎవరికివారై పోతున్న ఒంటరి ఆరాటం.

సంపదల కోట

ఎంత దూరమైనా
ఒక్క అడుగుతోనే ప్రారంభం
అడుగు అడుగు పడితేనే
అనుభవాలు పొదువుకునేది
ఆపదలను దాటుకునేది
బాధ్యతలెరుగని బాల్యం
కలలు కనే కౌమారం
బతుకుదెరువుల పోరాటంలో
వెలుగు నింపే యవ్వనం.
దేనికదే గొప్ప జ్ఞాపకం
అయినా
అన్నీ దాటుకుని
వార్ధక్యం వాకిలిలో
నిలిచినవారికున్న
అనుభవాల మూట
లెక్కలేనన్ని సంపదల కోట .
కొన్ని పనులు కష్టమైనా
ఇష్టమైతే సులభమే
ఇష్టాలకు ఇగురంగా నైపుణ్యం
జోడిస్తే నగిషీలు చెక్కినట్టే.
చేతి వృత్తులకు చేవ జోడిస్తే
తిరుగులేని ఆకృతులే
కమ్మరి కుమ్మరి కంసాలి కంచరి
నేతపని కుట్టుపని మేదరి
నాన్నల సారథ్యంలో పదును
పెట్టొచ్చు.
అక్షరజ్ఞానాలకు అమ్మ తోడైతే
పెద్ద చదువులకు ఇతర వృత్తులకు
ఇతోధికమై గుంభనంగా గురువులు
కరుణిస్తేనే బరువు దీరు.
కార్పొరేట్ కల్చర్ లో
కొట్టుమిట్టాడుతున్న
సరికొత్త చదువుల్లా
సిద్ధాంతాల రాద్ధాంతం కాకుండా
లౌక్యంగా పనులు చక్కబెట్టే
నిక్కచ్చి సందర్భాలలో
అనుభవాల నీడలే
ఆశా జ్యోతులు
అనుభవజ్ఞుల మాటలే
నవతరానికి వారధులు.

- నగునూరి రాజన్న

మూట

పెద్దల మాట చద్దిమూట
బామ్మ మాట బంగారు బాట
తరువులాంటి గురువు
నీడతోపాటు నడిపించు
ఉన్నతస్థితికి చేర్చు
అనుభవాలసారం
మంచిముత్యాలపేట.
నాకంతాతెలుసు
ముసలి ముతకమాటలు
అనే ఈసడింపు నిర్లక్ష్యంతో
అహంకారంతో తలెగరేస్తే
బ్రతుకు బండి పల్టీ
బొక్కలిరిగి దవాఖానాకే పరుగులండీ
బుద్ధిగావింటే నల్లేరు పై బండి
కామాంధుడు రావణుడు
పెడచెవినపెట్టె
మారీచుని మాటలను
వృద్ధ జటాయువు రెక్కలను తుంచి
తన తలకొరివి తనే పెట్టుకునే
భీష్మ పితామహుని ఈసడించి
కౌరవులు సర్వనాశనం
వృద్ధకపోతపు సలహాతో
ఐకమత్యంతో
వలతో సహా కపోతాలు ఎగిరే
రామకృష్ణ పరమహంస బోధనతో
స్వామి వివేకానందకు
విశ్వవిఖ్యాతి
ద్రోణుడు లాంటి గురువులు
పెద్దలకు లేదు లోటు
కుమ్మరిసారె
కమ్మరి పలుగుపార
ఒద్దికగా వృత్తినైపుణ్యంతో
సాగాలి యువత!
అనుభవమున్న వైద్యుడు
వృత్తికళాకారులు
వంటిల్లు మొదలు
అంతరిక్షందాకా
అనుభవజ్ఞులైన వృద్ధులదగ్గరే
నేర్చి తమ వృత్తులకు
పెట్టాలి పదును.
సంగీత నాట్య శిల్ప
చిత్ర లేఖనాది విద్యలు
గురువు మాట
బాటపైనే సాగితే సార్థకం
మూలనున్న ముసలితాత
గుంటలుపడిన
ఎండిన గుండెల అవ్వ కారు
పనికిరాని విరిగిన మంచాలు
ఎంతటి సాఫ్ట్వేర్ ఐనా
మహానటుడైనా
పెద్దలకడ
వినయవిధేయతలతో ఒదిగితేనే
ఆకాశమంత ఎత్తు సాధ్యం
చద్దిమూట బంగారుబాట
తరువు గురువు
చూప బతుకు తెరువు.

-ఎ.రాజ్యశ్రీ

నేటి తరం
తరాల అంతరాలను లెక్కలు వేస్తుంది
చాదస్తం తో ముడివేస్తుంది.
ఏం దాచారంటూ
ఆస్తుల కోసం ఎగబడతారు
అమ్మానాన్నలను దూరం నెట్టేస్తారు.
బంధాలకు అనుబంధాలకు
టాటా బై బై చెబుతారు.
ప్రేమగా చెయ్యందించి
నడిపించిన చేతులకి
వేస్తారు సంకెళ్లు
గోరుముద్దలు తినిపించిన
తల్లిదండ్రులె
తమ భాగ్యానికి సిరులని
ఆత్మీయతలకు నెలవని
దైవ సమానులని
అనుభవాల వారధులని
స్మృతి సౌధాలని
గత చరితకు సాక్ష్యాలని
భవితకు బంగరు బాటలు వేస్తారని
వారి అడుగు జాడలె
పిల్లలకు జీవన గమనమని,
గుర్తిస్తే వృద్ధాప్యమె వరం.

- పి.పద్మావతి

మానవత్వాన్ని బోధించేదే అసలైన మతం !

భారతీయ సమాజం గర్వపడే రోజుగా 11 సెప్టెంబర్ చరిత్రలో నిలుస్తున్నాయి. 11 సెప్టెంబర్ 1893న చికాగో సర్వమత మహా సమ్మేళనంలో స్వామి వివేకానందుడి 'అమెరికా సోదర సోదరీమనులారా' అంటూ ప్రారంభించిన అనితరసాధ్య ఆంగ్ల ప్రసంగంతో మహాసభ దద్దరిల్లేలా 3 నిమిషాల పాటు క్ంతాళ్ధ్వనులు మారుమోగాయి.అమెరికా ప్రజలు నీరాజనాలు పలికిన ప్రసంగం 'మానవ శాంతియుత సహజీవనానికి, పరమత సహనానికి పునాదులు వేసేది'గా చరిత్ర పుటల్లో ఆ ప్రసంగం నిలిచింది. ప్రపంచ దేశాల్లో ప్రతిధ్వనించిన అసాధారణ ప్రసంగంతో ప్రపంచ పలు మతాల పెద్దలను ఆశ్చర్యచకితుల్ని చేసింది. భారతీయ హిందూ ధర్మం అన్ని మతాలను గౌరవిస్తుందని, అన్ని మతాల గమ్యాలు మానవీయతను బోధిస్తున్నాయని, భారతీయ హిందూ హృదయాన్ని ఆసాంతం ఆవిష్కరించారు. వివేకానందుడి విజ్ఞాన వివేక వాక్పటిమ, విలక్షణ వ్యక్తిత్వం, నిజాయితీతో కూడిన సంభాషణకు విశ్వ మతాల ప్రతినిధులే కాకుండా అమెరికన్ పత్రికలు ప్రశంసించడం చూశాం. భారతీయ ఆత్మ, బు?షుల ప్రతిధ్వని, గురువు రామకృష్ణ పరమహంస ఽహిందుత్వ హృదయ ఆవిష్కరణ:

మానవులంతా భగవంతుణ్ణి చేరుకోవడానికే అంటూ పలు హిందూ సూక్తులు, భగవద్గీత శ్లోకాలను ప్రస్తావిస్తూ అద్వితీయ ప్రసంగం చేశారు. సర్వమతాలకు, సమస్త దేశాలకు చెందిన పీడితులను, శరనార్థులను గౌరవించి అక్కున చేర్చుకున్న భారతదేశ పౌరుడిగా గర్వంగా ఉందంటూ ప్రసంగం కొనసాగించారు. అన్ని మతాలు సహనాన్ని, సత్యాన్ని బోధిస్తున్నాయని విశ్వసిస్తున్నామని నొక్కివక్కానించారు. వివిధ ప్రదేశాల్లో పుట్టిన నదులు ప్రవహిస్తూ సముద్రంలో కలిసినట్లే, వివిధ మతాచారాలను అవలంభించే మనుషులు సర్వేశ్వరున్ని మాత్రమే చేరుకుంటారనే గీతాసారాన్ని విశ్వ మానవీయ ధర్మంగా వినిపించారు మన వివేకానందుడు. మతాభిమానం ముదిరి దురభిమానంగా, మూర్ఖత్వంగా మారగూడదని ఆవేదన వ్యక్తం చాశారు. మత విభేదాలతో ధరణి రక్తసిక్తం కాకూడదని, కలం లేదా కత్తితో సర్వమత దురభిమానానికి చరమగీతం పాడాలని ముగింపు వాక్యంగా శాంతి పాఠం బోధించారు.

11 సెప్టెంబర్ జంట టవర్ల కూల్చివేత దినం కూడా :

ఎప్టెంబర్ 11 తేదీ అనగానే రెండు ప్రధాన సంఘటనలు గుర్తు వస్తాయి. 11 సెప్టెంబర్ 2001న అమెరికా న్యూయార్క్ వరల్డ్ ట్రేడ్ సెంటర్ ట్విన్ టవర్స్‌ను ఇస్లామిక్ ఛాందసవాద ఒసామా బిన్ లాడెన్ అల్‌ఖైదా ఆత్మాహుతిదళ తీవ్రవాదులు నాలుగు విమానాలను పేల్చి వేసి "మానవ నాగరికతను విధ్వంసం" చేసిన దినంగా ప్రపంచ చరిత్రలో నిలిచింది. 9/11 దుర్ఘటనలో దాదాపు 2996 మంది పౌరులు మరణించగా, 25,000 వరకు గాయపడ్డ ఓ చీకటి విషాద జ్ఞాపకంగా మిగిలింది. నాటి నుంచి నేటి వరకు అల్‌ఖైదా, తాలిబాన్, ఐసిస్ లాంటి వందల ఉగ్రవాద సంస్థలు ప్రపంచ శాంతికి విఘాతం కలిగిస్తూ అఫ్ఘానిస్థాన్, లిబియా, ఇరాక్, యెమెన్, సిరియా లాంటి దేశాల్లో మానవ హక్కులు గాల్లో దీపాలై, రక్తం ఏరులై పారుతూనే ఉన్నది.

మతం మానవీయతను పోషించాలి:

మతాలు మానవీయతను పోషించాలని, సర్వమత బోధనలు మానవాళికి శాంతి సంక్షేమ బాటలు వేయాలని ఘోసిస్తున్న భారతీయ హిందు మత హృదయాన్ని అర్థం చేసుకొని జీర్ణించుకున్న స్వామి వివేకానందుడిని 'సర్వ మానవ నాగరికత వికాసానికి దీపస్తంభం'గా భావించి ప్రపంచ శాంతి కపోతాన్ని సగర్వంగా ఎగిరేలా చూడాల్సిన కనీస బాధ్యత ప్రపంచ మానవాళి ప్రతి ఒక్కరి మీద ఉందని నమ్ముదాం. మానవ విధ్వంస పునాదులపై నిలబడిన క్రూర తీవ్రవాదం ఎన్నిటికీ గెలవదని చరిత్ర చేదు అనుభవాలు వివరిస్తున్నాయి. భారతీయ హిందూ మతం పరమత సహనాన్ని, మత సామరస్యాన్ని గట్టిగా నమ్మిందనే విషయాన్ని సర్వమత మహాసభల్లో వినిపించిన నరేంద్రుడి చికాగో ప్రసంగం విశ్వ మానవాళికి హెచ్చరిక కావాలి. మతం కన్న మానవత్వమే మిన్న అని, అహింసే అత్యంత పదునైన ఆయుధమని నినదించిన వివేకానందుడి బోధనలు మానవ వివేకాన్ని జాగృతం చేయాలి. 9/11 తీవ్రవాద దుర్ఘటన పరమత హింసకు నిదర్శనమైతే, 9/11 చికాగో స్వామి ప్రసంగం భారతీయ హిందూవాదం ప్రపంచ మానవాళి ఐక్యత, శాంతి, పరమత సహనం, విశ్వ మానవాళి సామరస్యాలకు చిహ్నంగా నిలిచింది. ఏ రోజుకైన ఉగ్ర ఒసామాలు ఓడిపోవలసిందే, మేధో వివేకానందులు వెలుగులు చిమ్ముతూ గెలువవలసిందే.

(11 సెప్టెంబర్ 'వివేకానందుడి చికాగో విశ్వ సర్వమత మహా సమ్మేళన తొలి ప్రసంగ దినం' సందర్భంగా)

- డా॥బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

తెలంగాణ భవన్‌లో కాళోజీ నారాయణరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య. నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, కేపీ వివేకానంద.

తెలంగాణ చరిత్రలో అంతా కాళోజీ చరిత్రే!

తెలంగాణ చరిత్ర అంతా.. కాళోజీ నారాయణరావు చరిత్రే అని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ కొనియాడారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో నారాయణరావు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి,చ కేపీ వివేకానంద, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీలు దాస్యం వినయ్‌భాస్కర్, గాదరి కిశోర్, పట్లోళ్ల శశిధర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్, వాసుదేవరెడ్డి, చాద కిషన్‌రెడ్డి, రూప్‌సింగ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్, మహిళా నాయకురాళ్లు తుల ఉమ, ముక్తవరం సుశీలారెడ్డి, బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కడారి స్వామి యాదవ్, పడాల సతీశ్ పాల్గొన్నారు.

దిల్లీలో కాళోజీకి ఘన నివాళి

ఢిల్లీలో తెలంగాణ భవన్‌లోని అంబేద్కర్ ఆడిటోరియంలో ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు 110వ జయంత్యుత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ జ్యోతిప్రజ్వలన చేశారు.

సాహిత్యం, సామాజిక నిర్వహిస్తున్న
'బుధవారం బాద్షా'
పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ

అలౌకికబంధం

మనిషి జీవనప్రవాహం
పేగుబంధపు మమతల
శిఖరాన పుట్టి,ఎన్నెన్నో అనుబంధ
బాంధవ్యాలను కలుపుకుంటూ
సంసార సాగరమై వెలుస్తుంది...!!!
వావి వరుసలు కలిస్తే రక్తసంబంధం
మాటా మాటా కలిస్తే స్నేహబంధం
కళ్ళూ కళ్ళూ కలిస్తే ప్రేమ బంధం..
మనసూ మనసూ కలిస్తే
వివాహబంధం...!!!
తెలిసి తెలియక ఏర్పడే
ఋణానుబంధం..
ఆప్యాయతా
అనురాగాల మానవతా బంధం...
గౌరవాదరణల
గురుశిష్యసంబంధం...!!
అనేక బంధప్రవాహాల
సుడి గుండాలను
ఈదుకుంటూ
మనిషి చివరికి...చిక్కును
ఒక 'అలౌకికబాంధవ్యానికి
' బందీగా..
అదే అతని ఆఖరి అవ్యక్త బంధం...
ఆత్మా పరమాత్మల అపూర్వ
సంగమం..!!!.

-సావిత్రి రంజోల్కర్

ప్లస్ మైనస్ ల సయ్యాట..!!

తల్లిదండ్రులు పిల్లల మధ్య
ఏర్పడే పేగుబంధం,
రక్త సంబంధం,ఋణాను బంధం..
ముందు జన్మలో ఏదో రూపంగా
బాకి పడటమో,లేదా
అప్పు తీర్చుకుందానే మరణించడమో
జరిగితే..
ఆ రుణం తీర్చుకునేందుకు
సదరు వ్యక్తులతో
బంధం ఏర్పడి
తీర్చుకునేలా చేస్తాడు దైవము..
తోబుట్టువుల మధ్య అనురాగ బంధం,
పూర్వ జన్మల ఋణానుబంధం..
ఋణాను బంధ రూపేణా
పశుపత్ని సుతాలయా!
ఋణక్షయే క్షయం యాంతి
కా తత్ర పరిదేవనా..!!
పశువులు, భార్యాపుత్రాదులు
ఇళ్ళు,వాకిళ్ళన్నీ. ఋణాను బంధ
రూపంగా వస్తాయి..
ఋణము తీరగానే
బంధాలను వదిలిపెట్టి
పోతుంటాయని పెద్దల ఉవాచ..
చివరిమజిలీ దాకా వెంటుండి
కష్టసుఖాల్లో పాలుపంచుకునే
బంధాలు ఋణముండి ఏర్పడినవే..
తమ జీవితానుభవాలతో
మార్గ దర్శకం చేసే అమ్మమ్మలు,
తాతయ్యలు రుణ బంధాలే..
మూడుముళ్ళతో ముడిపడి
ఏడడుగులతో ఏర్పడే బంధం
దాంపత్య బంధం ఋణ బంధమే..
ఎన్నటికీ విడదీయలేని బంధంగా
మారే ప్రతి బంధమూ
ఋణ బంధమే..
ఓ పదిరూపాయలు భిక్షగాడి
జోలెలో వేసినానంటే అతనికి నేను
ముందు జన్మలో ఋణమున్నట్లే..
ఆ ఋణం తీర్చుకునేందుకు
భిక్ష గాడి జోలెలో వేసే ద్రవ్యం..
మోసపోయినామంటే
వారికి ఋణమున్నట్లే...
ప్లస్ మైనస్ లా సయ్యాటలో సాగే
జీవితం గడుస్తుంది
రుణాను బంధాల కలబోతలో..!!.

-డా.మరుదాడు అహల్యా దేవి
హైదరాబాద్

అమ్మ ఋణ బంధం

అమ్మ ఋణ బంధం
అసలు తీర్చుకోలేనిది
అమ్మ కెంత సేవ చేసినా
ఆమె ఋణం తీరిపోనిది .
పది నెలలు నిన్ను మోసింది
నీకై రక్తం ధారగా పోసింది
నిన్ను ప్రసవించిన సమయాన
నరకం అనుభవించింది .
నిన్ను కనుట కోసం మరో జన్మ
ఎత్తింది.
నిన్ను తన ఎదలో దాచుకుంది
నీ కోసం తన రక్తం పాలుగా మార్చి
నీకు తన చనుబాలు ఇచ్చింది.
నిన్ను పొత్తిళ్ళలో వేసి పెంచి
నీకు అహర్నిశలు సేవలు చేసింది
నీ మల సూత్రాలను తాను
అసహ్యించుకోక ఆనందంతో
నీ సేవలను చేసి నిన్ను పెంచింది.
అమ్మ ఋణ బంధం జన్మ
జన్మలకైనా తీరిపోలేనిది
నీవెంత సేవలు అమ్మకు చేసినా
అమ్మ ఋణ బంధం తీర్చుకోలేనిది,

-అక్కి నర్సింలు గౌడ్

ఉత్ప్రేరకాలు

ఉన్నాయో లేవో తెలియని
గతజన్మల,మరుజన్మల మాటలెందుకు...?!.
అల్లుకొనే అనుబంధాల
తోయము లేనిదే...
జీవిత పందిరి పచ్చదనం హరించును కాదా....?!.
ఆత్మీయతతో పెనవేసే కుటుంబ బంధాలు...
ఆపదలో,ఆనందంలో తోడుండే స్నేహబంధాలు...
పనిలో చేదోడువాదోడుగా నిలిచే వృత్తిపర బంధాలు...
మంచి మాటలతో సాంత్వన కలిగించే మమతానుబంధాలు!.
తలచుకున్న వెంటనే పెదవులపై
చిరునవ్వు తెప్పించే మధురానుబంధాలు...
సదా నీ శ్రేయస్సును కోరే మంచిమన 'సు' బంధాలు!
కాలమిలా ఆగిపోతే చాలుననిపించే
బోసినోటి బుజ్జాయిల అందాల బంధాలు...
మానవ జీవిత మనుగడకు ఉత్ప్రేరకాలే కదా!.

-చంద్రకళ. దీకొండ

చిత్రాక్షరి

సూర్యుడు
నడినెత్తిన ఉంచిన పాదాలకు
నా గుండె అలసిపోయింది..
చంద్రుడు
అదే నెత్తిన ఉంచిన పాదాలకు
నా శరీరం మురిసిపోయింది..
రెంటినీ మోసుకుంటూ
నన్ను నేనే మరచిపోయానేమో..
జీవితం కవిత్వమై ప్రకాశించింది..

-శైలజామిత్ర
9290900879

చట్టం ప్రత్యేక సంచిక ను ఆవిష్కరించిన మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి

హైదరాబాద్: సెప్టెంబర్ 11: చట్టం మాసపత్రిక ప్రత్యేక సంచికను హైదరాబాద్‌లోని బూర్గుల రామకృష్ణారావు భవన్‌లోని మీడియా అకాడమీ కార్యాలయంలో తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్రికా రంగంలో విలువలకు ప్రాధాన్యమిస్తూ పత్రికా రంగంలో నెలకొన్న పోటీని తట్టుకొని చిన్న పత్రికలు కొనసాగడం అభినందనీయమని అన్నారు.

ప్రజా సమస్యలకు చిత్రిక పడుతూ ముందుకు సాగుతున్న చట్టం పత్రికాధిపతి సిరిగాద ప్రసాద్ ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్మాల్ మీడియం న్యూస్ పేపర్స్ అండ్ మ్యాగజైన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యూసుఫ్ బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ అశోక్, రాష్ట్ర నాయకులు మాతంగి దాసు, వెంకటయ్య, టియూడబ్ల్యూజే ఐజేయు నిజామాబాద్ జిల్లా శాఖ అధ్యక్షులు సంజీవ్, ప్రధాన కార్యదర్శి బాలాజీ, కోశాధికారి చట్టం సిఈఓ సిరిగాద ప్రసాద్, ఆర్గనైజింగ్ సెక్రటరీ సంజీవ్ రెడ్డి, జాతీయ కార్యవర్గ సభ్యులు చింతల గంగాదాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రమోద్ గౌడ్, నిజామాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు బైర శేఖర్, ఉపాధ్యక్షులు జెట్టి గోవిందరాజు, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు కొక్కు రవి, పాకాల నర్సింలు, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుంకరి రాజేశ్, సంఘంకార్ ధనుంజయ్, సీనియర్ పాత్రికేయులు కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

సోమవారం శ్రీ త్యాగరాయ గానసభలో కళా సంగీత నాట్యవేదికపై ఎందరో మహానుభావులు మదుర స్మృతులలో భాగంగా కాళోజీ నారాయణగారి జయంతి సందర్భంగా సభలో ప్రసంగిస్తున్న కళా జనార్ధనమూర్తి, సీనియర్ పాత్రికేయులు జయసూర్య, సాయికుమార్ రెడ్డి, కేంద్ర సినీ సెన్సార్ బోర్డు సభ్యులు యస్.బి.రాము.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.